


గురువారం ఉదయం 6గంటల సమయంలో సూళ్లూరుపేటలో చెంగాళమ్మ ఆర్చి వద్ద.. - జాతీయ రహదారిపై లైట్లు వేసుకొని వస్తున్న వాహనాలు

వాన కురవాల్సిన వేళ..

పులికాట్ సరస్సుమీదుగా వాయుగుండం తీరం దాటింది. ఆ ప్రభావంతో వాన కురుస్తుందనుకుంటే.. ఆ స్థానంలో మంచుకురిసింది. సూళ్లూరుపేట, తడలో గురువారం తెల్లవారుజామున మంచుదుప్పటి కప్పుకుంది. ఉదయం 6 గంటల సమయంలోనూ దారి కనబడనంతగా మంచు కురవడంతో లైట్లు వేసుకొని ప్రయాణించారు వాహనదారులు. - తడ, ఆంధ్రజ్యోతి

వాయుగుండం తీరం దాటినా

పడని వర్షం

తడ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఓ పక్క అధికారుల హడావుడి. మరో పక్క వాతావరణశాఖ హెచ్చరికలు. పులికాట్ సరస్సు మీదుగా వాయుగుండం తీరం దాటుతోందంటే జనంలోనూ ఎక్కడో భయం. ఈ రాత్రికి ఏమవుతుందోనన్న ఆందోళన. తీరా చూస్తే అమ్మోతుఫాన్ అనుకున్నది కాస్త తుస్సు తుఫాన్‌గా మారిపోయింది. బుధవారం అర్ధరాత్రి 11 గంటల నుంచి గురువారం తెల్లవారుజామున 3 గంటల లోపు సూళ్లూరుపేట, చెన్నైల మధ్య తీరం దాటుతుందని అంచనావేశారు. ముఖ్యంగా సూళ్లూరుపేట, తడ మండలాలు అప్రమత్తంగా ఉండాలని తీవ్రమైన ప్రభావం ఈ మండలాలపై ఉంటుందని అధికారులు నిర్ధరణకు వచ్చారు. ఈ హడావుడి హెచ్చరికలతో ఈ రెండు మండలాలలోని ప్రజలలో కొంత ఆందోళన కన్పించింది. తీరా చూస్తే బుధవారం ఉదయానికి తుఫాన్ తీరందాటిందా అన్న అనుమానం ప్రజల్లో కలిగింది. ఎందుకంటే అసలు తుఫాన్ తీరందాటిన దాఖలాలే ఈ మండలాల్లో కనిపించలేదు. గురువారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో తడ మండలంలో సుమారు 22 కిలోమీటర్ల వేగంతో తుఫాన్ తీరందాటిందని అధికారులు చెప్పారు. అయితే తీరందాటే సమయంలో.. దాటిన తరువాత ఒక్క చినుకు కూడా పడలేదు. గురువారం ఉదయం నుంచి ఎండకాసింది. ఇంత పెద్ద తుఫాన్ ఎటువంటి ప్రభావం చూపకుండానే వెళ్లిపోయింది. ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ లేదని కొందరు పెద్దలు వ్యాఖ్యానించారు. కాగా, ఈ తుఫాన్ ప్రభావంతో ఐదు రోజుల్లో తడ మండలంలో 278.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకాగా, సూళ్లూరుపేట మండలంలో 378.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఇంత వర్షం కురిసినా చెరువులు, గుంటలు పాతికశాతంకూడా నిండకపోవడం విశేషం.

జిల్లాకు తప్పిన ముప్పు

- ఊపిరి పీల్చుకున్న అధికార యంత్రాంగం
- చెరువులు, రిజర్వాయర్లలోకి చేరుతున్న నీరు
- భారీ వర్షాలకు రూ. 6.52 కోట్ల పంట, ఆస్తి నష్టాలు


భారీ వర్షాలు, పెనుగాలులకు తోడు మెరుపు వరదలు ముంచెత్తే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ చేసిన హెచ్చరికలకు భిన్నంగా.. వాయుగుండం తీరం దాటింది. గురువారం తెల్లవారుజామున 4.30 గంటల సమయంలో తడ మండలంలో తీరం దాటినట్లు అధికారులు చెప్పారు. ఆ సమయంలో వర్షాలు, పెనుగాలులు, వరదలూ సంభవించకపోవడంతో జిల్లాకు ముప్పు తప్పినట్టయింది. దీంతో జిల్లా యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. - తిరుపతి, ఆంధ్రజ్యోతి

వాయుగుండం ప్రభావంతో గత 13 నుంచి 16వ తేదీ వరకూ భారీ వర్షాలు కురిశాయి. 14 మండలాల పరిధిలోని 52 గ్రామాలపై దీని ప్రభావం కనపడింది. ఊర్లలోకి.. ఇళ్లలోకి నీరు చేరడం, ఇళ్లు దెబ్బతినడం వంటి ఘటనల్లో 1183 మంది బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించారు. ఒక పక్కా ఇల్లు పూర్తిగా ధ్వంసం కాగా మరో రెండు పాక్షికంగా దెబ్బతిన్నాయి. 14 మిద్దె ఇళ్లు, 13 పూరి గుడిసెలు దెబ్బతిన్నాయి. మొత్తంగా వంద ఇళ్లు నీట మునిగాయి. 350 ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. 363 బాధిత కుటుంబాలకు చెందిన 1183 మందికి 20 పునరావాస కేంద్రాల్లో తాత్కాలిక ఆశ్రయం కల్పించారు. ఇక, 6512 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. అందులో 6487 ఎకరాలు వ్యవసాయ, 30 ఎకరాల్లో ఉద్యాన పంటలున్నాయి. ఏడు పశువులు, నాలుగు గొర్రెలు మృతిచెందాయి. పంచాయతీరాజ్ రహదారులు దారుణంగా దెబ్బతిన్నాయి. నాలుగు రోడ్లు 12.11 కిలోమీటర్ల మేర ఛిద్రమయ్యాయి. నాలుగు కల్వర్టులు కూలిపోవడం, కొట్టుకుపోవడం జరిగాయి. ఈ శాఖకు రూ.1.55 కోట్లు నష్టం వాటిల్లింది. మున్సిపల్ శాఖకు సంబంధించి ఒక భవనంతో పాటు 2.45 కిలోమీటర్ల రోడ్లు, 2.2 కిలోమీటర్ల మేరకు డ్రైనేజీ కాలువలు, 326 వీధి దీపాలు దెబ్బతిన్నాయి. తద్వారా ఈ శాఖకు రూ. 4.13 కోట్లు నష్టం జరిగింది. మైనర్ ఇరిగేషన్ శాఖ పరిధిలో నాలుగు చెరువులు దెబ్బతినడంతో రూ.62 లక్షల నష్టం సంభవించింది. 33-11 కేవీ సబ్ స్టేషన్లు ఆరు, 11 కేవీ విద్యుత్ స్తంభాలు 16, ఎల్‌టీ విద్యుత్ స్తంభాలు 30 దెబ్బతిని రూ.6.79 లక్షల నష్టం కలిగింది. జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలకు రూ.6.52 కోట్ల నష్టం వాటిల్లిందని జిల్లా యంత్రాంగం ప్రభుత్వానికి నివేదిక అందజేసింది.

భారీ వర్షాలు కలిగించిన నష్టాలు

- వెంకటగిరి మండలం చిన్నప్పపేట గ్రామం వద్ద సిమెంటు పైపులతో ఏర్పాటు చేసిన కల్వర్టు కొట్టుకుపోయింది. దీనిని గురువారం కలెక్టర్ వెంకటేశ్వర్ పరిశీలించారు.
- నారాయణవనం మండలం తిరువణ్యం వద్ద పంచాయతీరాజ్ శాఖకు చెందిన కాజ్‌వే దారుణంగా దెబ్బతింది.
- గూడూరు-వెంకటగిరి మార్గంలో రోడ్డు ఛిద్రమైంది. గూడూరు మండలం చెన్నూరు వద్ద కూడా రోడ్డు దెబ్బతింది.
- చిట్టమూరు మండలం మల్లాం రోడ్డు నుంచి కోగిలి వెళ్ళే మార్గంలో వర్షపు నీరు నలిచి భారీ గోతులు ఏర్పడ్డాయి.
- సూళ్లూరుపేటలో జీఎన్టీ రోడ్డు దారుణంగా దెబ్బతింది.
- పెళ్లకూరు మండలం పెసల గుర్రప్ప తోట వద్ద జాతీయ రహదారి నుంచి పాలచ్చూరు ఎస్టీ కాలనీకి నిర్మించిన తారు రోడ్డు తీవ్రంగా దెబ్బతింది. చిన్నప్ప నాయుడుపల్లి వద్ద తారురోడ్డు గోతులమయమైంది.
- నాయుడుపేట మండలం చిగురుపాడు రోడ్డు ఛిద్రమైంది.
- వరదయ్యపాలెం మండలం యానాది వెట్టు పంచాయతీలో రోడ్లన్నీ గోతులతో బురదమయంగా మారాయి.
- పిచ్చాటూరు మండలంలో శ్రీకాళహస్తి వెళ్ళే ప్రధాన రహదారి రూపం కోల్పోయింది.

నిన్న ఎడారిలా... నేడు జలకళ




గురువారం జలకళతో ఇలా..

వర్షాకాలంలోనూ చుక్కనీరు లేక ఎడారిని తలపించేలా బుధవారం వరకు ఉన్న స్వర్ణముఖినది.. ఇటీవల కురిసిన వర్షాలకు గురువారం జలకళతో తొణికిసలాడుతూ ప్రవహించింది. దాంతో స్థానికులు ఎంతో ఉత్సాహంగా స్వర్ణముఖినది పారుదల నీటిని చూసి ఆనందించారు. - నాయుడుపేట, ఆంధ్రజ్యోతి



22 అడుగులకు చేరిన అరణియార్



పిచ్చాటూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): తుఫాను ప్రభావంతో అరణియార్ నీటిమట్టంపెరుగుతోంది. ఏలం కాలువల ద్వారా గంటకు 1366 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు వచ్చి చేరుతుంది. దీని వల్ల గురువారం ఉదయం 6 గంటల సమయంలో ప్రాజెక్టు నీటి మట్టం 22 అడుగులకు(0.800 టీఎంసీ) చేరింది. అరణియార్ పూర్తి స్థాయి నీటిమట్టం 31 అడుగులు కాగా, నీటి సామర్థ్యం 1.85 టీఎంసీగా ఉంది.


చెరువులకు గండ్లు

- సాగునీరంతా పులికాట్‌లోకి

పరవళ్లు తొక్కుతున్న జలపాతాలు -8లో



సూళ్లూరుపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మండలంలో చెరువులకు గండ్లు పడడంతో రైతులు లబోదిబో మంటున్నారు. కుదిరి-తిప్పకండ్రిగ గ్రామాలకు చెందిన చింతాల చెరువుకు గండి పడి ఉన్న నీరంతా పులికాట్‌లోకి వెళుతోంది. తీర ప్రాంత గ్రామాల్లో దామరాయికి చెందిన పాడేరు చెరువు, కొల్లపొట్టుకు చెందిన కొత్త ట్యాంకు చెరువులకు కూడా గండ్లు పడడంతో వర్షపు నీరంతా పులికాట్ సరస్సులోకి వెళ్తుంది. గత ఏడాది డిసెంబరు మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో చింతాల చెరువుకు గండ్లు పడ్డాయి. అప్పుడు చెరువు కింద రైతులందరూ కలసి ఇసుక బస్తాలు వేసి గండ్లు పూడ్చి నీటిని కాపాడుకొన్నారు. దీనికి రూ.40 వేల వరకు ఖర్చయిందని గ్రామస్తులు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వమైనా చెరువుల మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.



చింతాల చెరువుకు గండి పడడంతో పులికాట్‌లోకి వెళ్తున్న నీరు - దామరాయి వద్ద పాడేరు చెరువుకు పడ్డ గండి

బాధితులకు కలెక్టర్ పరామర్శ



బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

ఏర్పేడు, అక్టోబరు 17: భారీ వర్షాలకు ఏర్పేడు మండలం కందాడు పంచాయతీ చిన్నప్పగుంట ఎస్టీ కాలనీలో కూలిపోయిన మట్టి మిద్దెలు, పూరిగుడిసెలను గురువారం కలెక్టర్ వెంకటేశ్వర్ పరిశీలించారు. బాధితులు గంగమ్మ, చంద్రమ్మ, చెంచమ్మను పరామర్శించారు. ప్రభుత్వం నుంచి పరిహారం అందిస్తామని పట్టా ఇచ్చి ఇల్లు కట్టించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కాలనీకి మంజూరు చేసిన ఇళ్లను దీపావళికి ప్రారంభించాలని లబ్ధిదారులకు సూచించారు. గ్రామంలోని పిల్లలందరిని పాఠశాలలకు పంపాలన్నారు. అనంతరం ఎన్టీఆర్ హౌసింగ్ కింద ఇంటి మంజూరుకు అధికారులుపరిశీలించి ప్రతిపాదనలు సమర్పించాలని ఆదేశించారు. తహసీల్దారు భార్గవి, ఎంపీడీవో సౌభాగ్యం, హౌసింగ్ ఏఈ తదితరులుపాల్గొన్నారు.

గాయపడిన సాయితేజారెడ్డి మృతి



సాయితేజారెడ్డి (ఫైల్ ఫొటో)

శ్రీకాళహస్తి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సాయి తేజారెడ్డి చికిత్సపొందుతూ మృతి చెందాడు. దీంతో కారులో ప్రయాణిస్తున్న నలుగురూ మృత్యువాత పడ్డారు. ఈ నలుగురిలో ముగ్గురు శ్రీకాళహస్తి వారే. పట్టణంలోని బంగారమ్మ కాలనీకి చెందిన సాయితేజారెడ్డి, హరితారెడ్డి దంపతులు, దక్షిణకైలాస్‌నగర్ కాలనీకిచెందిన రాజినేని శివతో పాటు ఓజిలి మండలం రాజుపేటకు చెందిన గోపి వారాంతపు విహార యాత్రకు వెళ్లొస్తుండగా ప్రమాదం జరిగిన విషయం తెలిసిందే. ఈ నలుగురిలో ముగ్గురు అక్కడికక్కడే మృతచెందగా, తీవ్రంగా గాయపడిన సాయితేజారెడ్డికి తానా సభ్యులు చికిత్స అందించారు. భారతదేశ కాలమానప్రకారం బుధవారం అర్ధరాత్రి సాయితేజా రెడ్డి కూడా మృతి చెందాడు. దీంతో దంపతులు ఇద్దరు మరణించడంతో ఆకుటుంబంలో మరింత విషాదం అలుముకుంది. మొత్తం నాలుగు మృతదేహాలు ఆదివారం లేదా సోమవారం శ్రీకాళహస్తికి చేరుకుంటాయని బంధువులు భావిస్తున్నారు ఇక రాజినేని శివ మృతదేహాన్ని చూసేందుకు నిరీక్షించలేక వారి తల్లిదండ్రులైన రమేష్‌నాయుడు, శశికుమారి తల్లడిల్లిపోయారు. బుధవారం బెంగళూరు నుంచి బిడ్డ భౌతికకాయాన్ని చూసేందుకు అమెరికా వెళ్లారు.



రాజినేని శివ (ఫైల్ ఫొటో)

సర్కారు మద్యం గోడౌన్లకు..

- రికార్డుల ఆధారంగా స్టాకు పరిశీలిస్తున్న ఎక్సైజ్ అధికారులు
- దుకాణాల్లోని ఫర్నిచర్, సామగ్రి వేలానికి సిద్ధం

తిరుపతి(నేరవిభాగం) అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మద్యం దుకాణాల్లోని స్టాకును ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకుంటున్నారు. ఈనెల 16 నుంచి ప్రైవేటు మద్యం దుకాణాలు ప్రారంభం కావడంతో 15నే ప్రభుత్వ షాపులు మూతపడ్డాయి. వీటిలో ఎంత స్టాకు ఉంది? గోడౌన్ల నుంచి ఎంత స్టాకు తీసుకొచ్చారు? ఎంత విక్రయించారనే వివరాలు సేకరిస్తున్నారు. ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ వాసుదేవచౌదరి ఆధ్వర్యంలో ఐదు నుంచి ఆరు టీములు దుకాణాల వారీగా స్టాకును పరిశీలించి పంచనామా నిర్వహించి స్వాధీనం చేసుకుని గోడౌన్లకు తరలిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా రూ.36 కోట్లు విలువ చేసే మద్యం స్టాకు ఉంటుందని అధికారుల అంచనా. గురువారం దాదాపు 20 శాతం దుకాణాల్లోని స్టాకు రికార్డులు పరిశీలించారు. వీటిల్లోని ఫర్నిచర్, ఎలక్ట్రానిక్ వస్తువులు, డిజిటల్ మిషన్లు ఇతర పరికరాలు, ఎక్కడైనా సొంత భవనాలుంటే స్వాధీనం చేసుకుంటున్నారు. వీటిని వేలం వేసి వచ్చిన డబ్బును ఖజానాకు జమచేయనున్నారు.

ర్యాట్ బైట్ పేరుతో స్వల్ప తేడాలు

తిరుపతి అర్బన్ పరిధిలోని ఒక దుకాణంలో మాత్రం ర్యాట్ బైట్ పేరిట రూ.6500 విలువ చేసే ప్లాస్టిక్ సీసాల మద్యం బాటిళ్ల తేడాలు వున్నట్లు అధికారుల దృష్టికి వచ్చింది. దీన్ని సంబంధిత సూపర్‌వైజర్, సేల్స్‌మెన్ ద్వారా ప్రభుత్వానికి జమచేయిస్తామని ఎక్సైజ్ అధికారులు చెప్పారు. మిగిలిన దుకాణాల్లో మాత్రం స్వల్పంగా తేడాలున్నట్లు తెలిపారు. ఒంగోలులో జరిగిన గోల్‌మాల్‌తో మేల్కొన్న ఎక్సైజ్ అధికారులు.. దుకాణాల్లోని ప్రతి స్టాకును క్షుణంగా పరిశీలిస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తి కావడానికి 10 నుంచి 15 రోజులు పట్టవచ్చని అధికారులు అంటున్నారు.

పల్లె పండుగతో గ్రామాలకు మేలు

మంగళం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పల్లె పండుగతో గ్రామాలకు ఎంతో మేలు జరుగుతుందని డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ అన్నారు. గురువారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ తిరుపతి జిల్లా పరిధిలో పల్లె పండుగ ద్వారా ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో రూ.50కోట్లతో సీసీ రోడ్లు, రూ.30 కోట్లతో డ్రైన్‌లు నిర్మిస్తున్నామన్నారు. రూ.25కోట్ల అంచనాతో అనిమల్ షెల్టర్లు నిర్మించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. శ్మశాన వాటికల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రోడ్లపై తిరిగే పశువుల షెల్టర్ నిర్మాణానికి రూ.50లక్షలతో ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. దామినేడు హౌసింగ్ కాలనీ వద్ద యూడీఎస్ నిర్మాణానికి రూ.కోటి మంజూరు చేశామన్నారు. జిల్లా అటవీ శాఖ పరిధిలో నర్సరీలు ఏర్పాటు చేసి, వనాభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. జిల్లావ్యాప్తంగా 3,288 కాలువల్లో పూడికతీశామని, తద్వారా వర్షపునీరు నేరుగా చెరువుల్లోకి వెళుతోందని తెలిపారు.

21న పీజీ స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పద్మావతి యూనివర్సిటీలో ఈనెల 21వ తేదీన పీజీ కోర్సుల్లో ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నారు. పీజీసెట్‌లో ఉత్తీర్ణత సాధించి ఇప్పటిదాకా ఎక్కడా అడ్మిషన్ పొందని వారు ఇందుకు అర్హులు. ఒరిజినల్ సర్టిఫికెట్లతో డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ (డీఓఏ) కార్యాలయంలో కానీ, ఎస్‌పీఎంవీవీ. వెబ్‌సైట్ కానీ చూడవచ్చునని వర్సిటీ పీఆర్వో శ్రీరజని తెలిపారు.

స్విమ్స్‌లో మహిళలకు రాయితీతో మామోగ్రామ్ పరీక్షలు

- ఈనెల 21 నుంచి 31వ తేదీ వరకు నిర్వహణ

తిరుపతి(వైద్యం),అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ రొమ్ము క్యాన్సర్ అవగాహన మాసాన్ని పురస్కరించుకుని స్విమ్స్‌లో ఈనెల 21 నుంచి 31వ తేదీ వరకు మహిళలకు ప్రత్యేక రాయితీతో మామోగ్రామ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ గురువారం తెలిపారు. 40 ఏళ్లు పైబడిన మహిళలు రొమ్ము, అండాశయ క్యాన్సర్‌కు సంబంధించి మామోగ్రామ్ పరీక్ష చేయించుకోవాలని సూచించారు. రూ.వెయ్యికే డాక్టర్ కన్సల్టేషన్, మామోగ్రామ్ పరీక్షలు అందుబాటులోకి తీసుకువచ్చామని, ప్రభుత్వ సెలవు దినాలు మినహా మిగిలిన రోజుల్లో సేవలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు స్పెషల్ క్లినిక్‌గా పేర్లు నమోదు చేసుకోవాలని, పూర్తి వివరాలకు 83339 97968కు సంప్రదించాలని కోరారు.

వైభవంగా కల్యాణ వెంకన్న గరుడోత్సవం



చంద్రగిరి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం రాత్రి గరుడోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. నిత్య సేవల్లో భాగంగా ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యకట్ల కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం ఉత్సవర్లను కల్యాణ మండపానికి వేంచేపు చేసి శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా సాయంత్రం స్వామివారి ఉత్సవమూర్తిని పట్టుపీతాంబరాలు, బంగారు ఆభరణాలతో విశేషంగా అలంకరించారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన గరుడ వాహనంపై అధిష్టించారు. ఆలయ మాడ వీధుల్లో గోవింద నామస్మరణల మధ్య ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు వెంకటస్వామి, రమేష్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ అనుంబట్టు ధనశేఖర్, అర్చకులు బాలాజిరంగాచార్యులు, శేషాద్రిచార్యులు, నారాయణచార్యులు, పార్థసారిథి, జమేదర్ చిరంజీవి, సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపేదల అంత్యక్రియలకు ఆర్థిక సహాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న సేవాసంఘం సభ్యులు

పాకాల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దామల చెరువు హైస్కూల్ గేటులోని వరసిద్ధి వినాయక సేవాసంఘం పేదల అంత్యక్రియల సమయంలో చేదోడు వాదోడుగా నిలుస్తోంది. సేవాతత్పరత చాటుకుంటోంది. హైస్కూల్ గేట్, యల్లంపల్లె, కేసవనగర్, పోలిశెట్టిపల్లె, ఎస్టీ కాలనీ బండకాడపల్లె గ్రామాల్లో పేదవారు మరణిస్తే దహన సంస్కారాలకు రూ.10 వేలు అందజేస్తోంది. ఈక్రమంలో గురువారం హైస్కూల్ గేటు వద్ద మరణించిన కె.మంగమ్మ (57) కుటుంబ సభ్యులకు సేవా సంఘ సభ్యులు రూ.10వేలు అందజేశారు

మానవ అక్రమ రవాణా నిర్మూలన సమష్టి బాధ్యత


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎస్ఐ, సభ్యులు

రామచంద్రాపురం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మానవ అక్రమ రవాణా నిర్మూలన అందరి బాధ్యత అని ఎంఈవోలు మార్కొండయ్యనాయుడు, జయవేలు అన్నారు. గురువారం ఆర్సీపురం పోలీస్‌స్టేషన్‌లో ఆస్ట్రేలియాకు స్వచ్ఛంద సంస్థ ఏ21, ది మూమెంట్ ఇండియా ముంబైసంస్థ, మదనపల్లెకు చెందిన గ్రామజ్యోతి సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణా నిర్మూలనపై పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సివిల్ సొసైటీ సంస్థ, సెంటర్ ఫర్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు చంద్రశేఖర్ ఎస్ఐ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

'పొలం పిలుస్తోంది'ని సద్వినియోగం చేసుకోవాలి


రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

రామచంద్రాపురం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏవో స్రవంతి కోరారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని సీకేపల్లి సచివాలయంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి అందే వ్యవసాయ పథకాలను గురించి వివరించారు. పశువైద్యాధికారి హేమకుమార్ పాడి రైతులకు పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ రంగయ్య, అధికారులు పాల్గొన్నారు.

సీహెచ్‌సీని తనిఖీ చేసిన డీసీహెచ్ఎస్


వైద్య పరికరాలను పరిశీలిస్తున్న డాక్టర్ ఆనందమూర్తి

చంద్రగిరి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరిలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని డీసీహెచ్ఎస్ డాక్టర్ ఆనందమూర్తి గురువారం తనిఖీ చేశారు. అన్ని విభాగాలను పరిశీలించారు. పారిశుధ్య నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. రోగుల అడ్మిషన్,ఓపీలు, రోజువారి రక్త పరీక్షలు, శస్త్ర చికిత్సలు వంటి అంశాలపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అరుణను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఆయన వెంట వైద్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

దర్జాగా నడకదారి ఆక్రమణ



ఫుట్‌పాత్ స్థలంపై ప్రహరీ నిర్మాణం

తిరుపతి అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మంగళం పరిధిలోని వేంకటేశ్వర కాలనీ సమీపం, కరకంబాడీరోడ్డు ఎడమవైపు ఖాళీస్థల యజమాని ఏకంగా ప్రజల నడకదారిని అక్రమించుకున్నాడు. అక్కడ తాత్కాలిక ప్రహరీ నిర్మించేశాడు. తన జాగాలో దాదాపు 30అంకణాల స్థలాన్ని కలిపేసుకున్నాడు. ఆ జాగాకు ఎగువన, దిగువన ఫుట్‌పాత్ స్పష్టంగా కనబడుతోంది. రోడ్డు అంచు వరకు సిమెంట్ పలకలతో గోడను నిర్మించేయడాన్ని స్థానికులు ఆక్షేపిస్తున్నారు. రోడ్లభవనాల శాఖ అధికారులు కూడా ఏమాత్రం పట్టనట్టు మిన్నకుండిపోయారు. తిరుపతి శివారు ప్రాంతాల్లో స్థలాల విలువ ఎక్కువగా ఉండటంతో కొందరు ఇలాంటి దురాక్రమణలకు ఒడిగుడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ ప్రాంతంలో ప్రధాన రహదారి దగ్గర అంకణం రూ. 3లక్షల నుంచి రూ. 4లక్షల వరకు ధర పలుకుతోంది. సంబంధిత అధికారులు స్పందించి కట్టడి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

వైసీపీ నాయకుల నుంచి ప్రాణహాని

● ఎస్పీకి వీడియో పంపిన ట్యాక్సీడ్రైవర్


వీడియోలో మాట్లాడుతున్న మురళీకృష్ణ

తిరుమల, అ క్టోబరు17(ఆంధ్రజ్యోతి): తిర ుమలలోని కొంతమంది వైసీపీ నాయకులు తనపై దాడికి దిగారంటూ మురళీకృష్ణ అనే ట్యాక్సీ డ్రైవర్ ఆందోళన వ్యక్తం చేశాడు. గురువారం రాత్రి ఇతను ఈమేరకు ఓ వీడియోను జిల్లా ఎస్పీ, తిరుమల టూటౌన్ పోలీసులకు పంపాడు. వీడియోలో పేర్కొన్న ప్రకారం.. ముళ్లగుంట పార్క్‌లో కొంత మంది ట్యాక్సీ యూనియన్ ఏర్పాటు చేశారు. యూనియన్‌లో చేరాలంటే రూ.10,500 కట్టాలని డిమాండ్ చేశారు. ఈవిషయాన్ని గురువారం ఉదయం అతను ఎస్పీకి ఫిర్యాదు చేశాడు. చర్యలు తీసుకుంటామని, తిరుమలకు వెళ్లి ఎప్పటిలా ట్యాక్సీ నడుపుకోమని ఎస్పీ సూచించారు. తీరా వెళితే మురళీకృష్ణ వాహనంలో భక్తులు ఎవరు ఎక్కకుండా కొంతమంది వైసీపీ నాయకులు అడ్డుకున్నారు. అంతేకాకుండా వారు తనపై దాడి చేశారంటూ అతను వీడియోలో ఆవేదన వ్యక్తం చేశాడు. వారి నుంచి తనకు, కుటుంబానికి ప్రాణహాని ఉందన్నారు. వాహనం అద్దెకు ఇచ్చిన ఓనర్ని కూడా బెదిరిస్తున్నారన్నాడు. ఫిర్యాదును పరిశీలిస్తున్నామని పోలీసులు తెలిపారు.

గురు దక్షిణామూర్తికి శాస్త్రోక్తంగా పూజలు



శ్రీకాళహస్తి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మేధో గురు దక్షిణామూర్తికి గురువారం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా కలశ ప్రతిష్ఠ ఏర్పాటు చేసిన అనంతరం వినాయక పూజల కలశ పూజ వైదిక కత్రువులు నిర్వహించారు. స్వామివారికి పాలు, పెరుగు, పంచామృతం, చందనం, నారికేళ జలాలతో వైభవంగా అభిషేకం నిర్వహించారు. సుగంధ పూలు, స్వర్ణాభరణాలతో విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. పర్వత హారతి, చక్ర హారతి, కుంభ హారతి, మహామంగళ హారతులు ఇచ్చారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. వేదపండితులు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారిసేవలో ప్రముఖులు


మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

తిరుమల, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, సినీనటి రాశి ఉన్నారు. ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

ఎలక్ట్రిక్ పోటరీ వీల్‌పై శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం

భాకరాపేట, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డ్ కులాల సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో ఖాదీ గ్రామీణ పరిశ్రమల కమిషన్ ద్వారా ఎలక్ట్రిక్ పోటరీ వీల్‌పై శిక్షణ ఇవ్వనున్నారు. దీనికి ఆసక్తి గల ఎస్సీ కులానికి చెందిన వారు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో గిడ్డయ్య కోరారు. ఆధునిక పరికరాల వినియోగంపై వారికి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తుదారు 18 ఏళ్ల నుంచి 55 ఏళ్లలోపు ఉండాలన్నారు. ఏ ఇతర ప్రభుత్వ పథకం నుంచి లబ్ధి పొందనివారై ఉండాలన్నారు. కుల ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా ఉండాలన్నారు. ఈ నెల 20వ తేదీలోప దరఖాస్తులు సమర్పించాలన్నారు. మరిన్ని వివరాలకు 9959403234, 9959015657 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

భాకరాపేట, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు మండలం చెరువుముందరపల్లెలో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు డమరుకనాథరెడ్డి తెలిపారు. తిరుపతి రుయా ఆసుపత్రి వైద్యుల ఆధ్వర్యంలో కంటి పరీక్షలు చేస్తారన్నారు. అవసరమైనవారికి ఉచితంగా ఆపరేషన్లు చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9440401706 ఫోన్ నంబరులో సంప్రదించాలన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి

పాకాల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం వాల్మీకి మహర్షి జయంతి ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ నంగా పద్మజరెడ్డి, ఎంపీడీవో శశిరేఖలు మాట్లాడుతూ వాల్మీకి మహర్షి వాల్మీకి స్ఫూర్తితో యువత ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పదనాభ చౌదరి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసరాలు పంపిణీ



తిరుపతిరూరల్, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం ఓటేరు పంచాయతీలోని గంగిరెడ్డులకాలనీలో వరద బాధితులకు గురువారం తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి నిత్యావసర సరుకులు అందజేశారు. సర్పంచ్ లక్ష్మి, వైస్ ఎంపీపీ విడుదల మాధవరెడ్డి, కొత్తపాటి మునీశ్వర రెడ్డి, లింగేశ్వరనగర్ సర్పంచ్ ముసుగు కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

దుకాణంలో ఆత్మహత్య

రేణిగుంట, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): టిఫిన్ దుకాణంలో ఉరి వేసుకుని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం ఉదయం రేణిగుంటలో జరిగింది. రేణిగుంట అర్బన్ పోలీసుల కథనం మేరకు.. మండల పరిధిలోని తిమ్మయ్య గుంటకు చెందిన మునిరత్నం(50) అనారోగ్య కారణంగా పాత చెక్‌పోస్టు షట్టర్‌కు బీగాలు వేయకుండా వదలివేయడంతో టిఫిన్ దుకాణంలోకి వెళ్లి వైర్లతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు అందించిన సమాచారం మేరకు రేణిగుంట అర్బన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయా ఆస్పత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెస్సీ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి(వైద్యం), అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): స్విమ్స్ యూనివర్సిటీలో ఎమ్మెస్సీ బయో టెక్నాలజీ, బయో ఇన్ఫర్మేటిక్స్ కోర్సులకు ఈనెల 19, 20 తేదీల్లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రారు అపర్ణ బిట్లా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బయో టెక్నాలజీ 1, బయో ఇన్ఫర్మేటిక్ 5 సీట్లు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. ఏపీ పీజీ సెట్ క్వాలిఫై అయిన అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, ర్యాంక్ కార్డు, ఫీజుతో కేటాయించిన తేదీల్లో హాజరుకావాలని కోరారు. పూర్తి వివరాలకు స్విమ్స్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.

ఇద్దరు చైన్ స్నాచర్ల అరెస్టు

శ్రీకాళహస్తి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఇద్దరు చైన్ స్నాచర్లను అరెస్టు చేసినట్లు శ్రీకాళహస్తి రెండవ పట్టణ సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. తమిళనాడు రాష్ట్రం సేలంకు చెందిన శశికుమార్(23), సురేష్(20) శ్రీకాళహస్తి పట్టణంలోని కుందేటివారి వీధిలో రెండు రోజుల క్రితం మహిళ మెడలో గొలుసును లాక్కుని ఉడాయించారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. శ్రీకాళహస్తి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలో గురువారం శశికుమార్, సురేష్‌ను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

శిథిలావస్థలో పశువైద్య కేంద్ర భవనాలు

●బిక్కుబిక్కుమంటూ సిబ్బంది సేవలు ●కొరవడిన ప్రాథమిక వసతులు



అధ్వానస్థితిలో పదిపుట్లబైలు, మొగరాల పశువైద్యశాల భవనం

పాకాల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పదిపుట్లబైలు, మొగరాలలోని పశువైద్య కేంద్ర భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. పదిపుట్లబైలు పరిసరాల్లో అటవీప్రాంతం ఎక్కువ కావడంతో పశుసంపద ఎక్కువగా ఉంది. ఈ పంచాయతీ పరిధిలో సుమారు 1600కు పైగా పశువులు, 900కు పైగా మేకలు, గొర్రెలున్నాయి. ఈ ప్రాంత రైతులు వ్యవసాయంతో పాటు పశు పోషణతో జీవనాధారం సాగిస్తుంటారు. ఇక్కడ రైతుల అవసరాలను గుర్తించి గతంలో గ్రామీణ పశువైద్య ఉపకేంద్రాన్ని ఏర్పాటు చేశారు. లైవ్ స్టాక్ అసిస్టెంట్ వైద్య సేవలు అందిస్తారు. రోజూ 25 నుం 30 వరకు పశువులను వైద్యం కోసం రైతులు ఈ కేంద్రానికి తీసుకువస్తుంటారు. అయితే ఇక్కడి భవనం అధ్వానస్థితికి చేరుకుంది. శ్లాబ్ పెచ్చులూడిపోయాయి. చిన్నపాటి వర్షానికి ఉరుస్తోంది. దీంతో మందులు, ఇతర సామగ్రి నిల్వ ఉంచుకోవడానికి వీలులేకుండా పోతోంది. పెచ్చులూడిపోయిన భవనంలోనే సిబ్బంది పనిచేస్తున్నారు.

మొగరాలలోనూ ఇదే దుస్థితి

మొగరాలలోని మేజర్ సబ్‌సెంటర్ భవనం కూడా శిథిలస్థితిలో చేరుకుంది. కనీస నీడలేకుండా రొచ్చురొచ్చుగా తయారయింది. ఈ కేంద్రాల్లో కనీస మౌలిక సదుపాయాలు కరువయ్యాయి. మందులు సరఫరా చేయడంలేదు. పశువలకు జబ్బు చేస్తే మందుల కోసం రైతులు అవస్థలు పడుతున్నారు. పదిపుట్లబైలు నుండి కల్లూరు, దామలచెరువుకు వెళ్లి ప్రైవేటు మెడికల్ షాపుల్లో తెచ్చుకుంటున్నారు. పశువైద్య కేంద్రాలకు కొత్త భవనాలు మంజూరు చేయాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు. భవనాల్లో వైద్యసేవలకు అవసరమైన వసతులు కల్పించాల్సి ఉంది. మందులు కొనుగోలు చేసుకోవడం ఇబ్బందిగా ఉందని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

ప్చ్..సీసీ రోడ్డు వేసినా ఏం ప్రయోజనం?

● ట్యాంపర్ చేయడం మరిచారు.
●తరచూ ప్రమాదాలతో ఆందోళన


జాగ్రత్తగా వెళ్లకుంటే ప్రమాదమే

చంద్రగిరి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆర్ఎఫ్ రోడ్డులో రెండు నెలల క్రితం సీసీ రోడ్డు వేసి ఒకపక్క ట్యాంప్ చేయడం మరిచారు. దీంతో నిత్యం వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. శ్రీనివాసమంగాపురం మార్గంలోని ఆర్ఎఫ్ రోడ్డు ఐదేళ్లుగా గుంతలమయంగా ఉండేది. కూటమి ప్రభుత్వం వచ్చాక అధికారంలోకి రావడంతోనే ప్రప్రథమంగా దీనికి ప్రాధాన్యతనిచ్చింది. సీసీ రోడ్డు నిర్మించింది. కొంతదూరం వేసినా సాధారణ రోడ్డు కన్నా సీసీ రోడ్డు అడుగు ఎత్తులో ఉంది. ఒకవైపు మాత్రమే అడుగు మేర తారు రోడ్డులోకి కలుపుతూ ఏటవాలు చేశారు. మరో పక్క ఏటవాలు చేయకుండా మటి పోశారు. గడచిన రెండు నెలల్లో అప్పుడప్పుడూ కురుస్తున్న వర్షాలకు అక్కడ గుంతలమయమైంది. మూడు రోజులుగా కురిసిన వర్షాలకు వరద నీటికి మట్టికొట్టుకుపోయింది. దీంతో ఆ దారిలో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. సీసీ రోడ్డు ఏటవాలుగా లేదని గమనించని ద్విచక్ర వాహనదారులు వేగంగా వచ్చి ప్రమాదాలకు గురవుతున్నారు. నాలుగు చక్రాల వాహనాలకు కూడా ఇబ్బంది కలుగుతోంది. ఈదారిలో నిత్యం తమిళనాడు, కర్ణాటక, రాష్ట్రాల నుంచి శ్రీవారి దర్శనానికి చంద్రగిరి మీదుగా శ్రీనివాసమంగాపురం, శ్రీవారిమెట్టుకు వస్తుంటారు. చంద్రగిరి ప్రజలు, పట్టణానికి దక్షిణం వైపు గ్రామాల ప్రజలు, పీలేరు, మదనపల్లెకు ఇదే మార్గంలో వెళ్ళాలి. అధికారులు స్పందించి సీసీ రోడ్డును ఏటవాలుగా చేయాలని కోరుతున్నారు.

అవినీతి నిర్మూలనకు కృషి చేసిన ఘనత రాజీవ్‌దే



సమావేశంలో మాట్లాడుతున్న చింతా మోహన్

తిరుపతి(వైద్యం), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): దేశాన్ని అభివృద్ధి బాటలో నడిపించడంతో పాటు అవినీతి నిర్మూలన దిశగా కృషి చేసిన ఘనత దివంగత ప్రధాని రాజీవ్ గాంధీకే దక్కుతుందని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ అన్నారు. తిరుపతిలోని ఓ హోటల్లో అకాడమీ ఆఫ్ గ్రాస్‌రూట్స్ స్టూడెంట్స్ అండ్ రీసెర్చ్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గురువారం రాజీవ్ గాంధీ స్మారక జాతీయ అవార్డులు ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన చింతా మోహన్ మాట్లాడుతూ ప్రధానిగా రాజీవ్ గాంధీ చేసిన సేవలు మరువలేనివని, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన ఎంతో కృషి చేశారని అన్నారు. పల్లెలను పట్టణాలను మార్చేందుకు పంచాయతీరాజ్ చట్టం, ఎస్సీ, ఎస్టీల రక్షణ కోసం అట్రాసిటీ చట్టాన్ని తీసుకువచ్చి విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారన్నారు. అనంతరం పలువురికి జాతీయ అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కర్ణాటకకు చెందిన ఫైనాన్స్ కమిటీ మాజీ చైర్మన్ నారాయణస్వామి, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు ప్రమీలమ్మ పాల్గొన్నారు.

చట్టసభల్లో మహిళా భాగస్వామ్యం అవసరం


సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న నారాయణస్వామి

తిరుపతిరూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర, జాతీయ స్థాయి చట్టసభల్లో (శాసనసభ, పార్లమెంటు) మహిళల భాగస్వామ్యం కోసం మరిన్ని సంస్కరణలు చేపట్టాలని కర్ణాటక రాష్ట్ర ఐదవ ఆర్థిక సంఘం అధ్యక్షుడు నారాయణస్వామి స్పష్టం చేశారు. తిరుపతిలోని ఓ హోటల్లో భారత గ్రామీణ అధ్యయనం, పరిశోధనా అకాడమీ (అగ్రశ్రీ) ఆధ్వర్యంలో న్యూఢిల్లీకి చెందిన భారత సామాజిక విజ్ఞాన శాస్త్రాల సంస్థ సౌజన్యంతో పరిపాలనదక్షులుగా మహిళల సాధికారిత అనే అంశంపై నిర్వహించిన రెండ్రోజులు జాతీయ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పంచాయతీల నుంచి పార్లమెంటు వరకు మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించడంతోపాటు పరిపాలనా వ్యవహారాల్లో భాగస్వామ్యం కావడానికి సంస్కరణలు చేపట్టాల్సిన అవసరం ఉందని తెలిపారు. కర్ణాటక పంచాయతీ రాజ్ పరిషత్ అధ్యక్షుడు వెంకట్రావు మాట్లాడుతూ పంచాయతీరాజ్ సంస్థల పనితీరు ఆధారంగా వాటికి నిధులు ఇవ్వాలని సూచించారు. జాతీయ మహిళా సంఘ మాజీ సభ్యురాలు శాంతారెడ్డి మాట్లాడుతూ ప్రతి రాజకీయ పార్టీ 33 శాతం సీట్లను మహిళలకు కేటాయించాలని అభిప్రాయపడ్డారు. మహిళా కాంగ్రెస్ రాష్ట్ర మాజీ నాయకురాలు ప్రమీల మాట్లాడుతూ సమాజంలో మహిళలు అన్ని విషయాల్లో ముందంజలో ఉంటే దేశపురోభివృద్ధి త్వరగా సాధ్యపడుతుందని తెలిపారు. వివిధ అంశాలపై పలువురు పత్ర సమర్పణ చేశారు.

టీడీపీ నాయకుల చొరవతో మారింది రహదారి దుస్థితి



పాకాల - తోటపల్లె - మద్దినాయునిపల్లె - కొత్తవడ్డిపల్లె రోడ్లు ఇరువైపుల ముళ్లకంపల తొలగింపు

పాకాల, అక్టోబరు 17: ప్రమాదాలకు కారణమవుతున్న రహదారి విషయంలో స్థానిక టీడీపీ నాయకులు చొరవ తీసుకున్నారు. జాతీయ రహదారికి అనుసంధానమైన పాకాల - తోటపల్లె రోడ్డులో నిత్యం వందలాది వాహనాలు వెళ్తుంటాయి. అయితే రోడ్డు కిరువైపులా ముళ్లకంపలు దట్టంగా పెరిగి పోయాయి. ఎదురుగా వాహనాలు వస్తే వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఇటీవల ఈ సమస్యను స్థానికులు ఎమ్మెల్యే పులివర్తి నాని దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే స్పందించి స్థానిక టీడీపీ నాయకులతో మాట్లాడారు. కంపలను తొలగించాలని సూచించారు. దీంతో వారు గురువారం యంత్రం సాయంతో ముళ్లకంపలను తొలగించారు. మద్దినాయునిపల్లె రోడ్డు నుంచి కొత్త వడ్డిపల్లె గుడార్ల బండ వరకు రెండు కిలోమీటర్ల మేర రోడ్డు కిరువైపుల పెరిగిన ముళ్లకంపలను, పిచ్చిమొక్కలను స్థానిక టీడీపీ నాయకులు శ్రమదానంతో తొలగించారు. మాజీ ఎంపీటీసీ నాని రాజగోపాల్ నాయుడు, విశ్వనాథంనాయుడు, గిరినాయుడు,లు పాల్గొన్నారు.

భారీ వర్షాలతో తొండమనాడు చెరువుకు సమృద్ధిగా జలాలు


చెరువు పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వరన్

శ్రీకాళహస్తి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): తొండమనాడు చెరువు పూర్తిస్థాయిలో నిండటం సంతోషకరమని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. శ్రీకాళహస్తి మండలంలోని తొండమనాడు చెరువును అధికారుల బృందంతో కలిసి గురువారం కలెక్టర్ పరిశీలించారు. చెరువు కలుజును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత వర్షాలకు ముందు తొండమనాడు చెరువులో 0.1 టీఎంసీ నీరు మాత్రమే నిల్వ ఉండేదన్నారు. అల్పపీడనంతో కురిసిన భారీ వర్షాలతో తొండమనాడు చెరువులో 0.5టీఎంసీల నీరు నిల్వ చేరి కలుజు పారే స్థాయికి రావడం సంతోషకరమన్నారు. దీంతో ఈ చెరువు ఆయకట్టు కింది 14 గ్రామాల రైతులకు మేలు జరుగుతుందన్నారు. అలాగే 4,386 ఎకరాల ఆయకట్టుకు సాఫీగా సాగునీరు అందుతుందన్నారు. డ్రైన్ వాటర్‌ను సాగునీరుకు ఉపయోగించుకోవడం ఎంతో ఉత్తమమని సీఎం చంద్రబాబు ఎప్పుడూ చెబుతుంటారని గుర్తు చేశారు. తొండమనాడు చెరువుద్వారా ఆయన మాటలు నిజమవుతున్నాయని తెలిపారు. ఇక జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో 350కుపైగా ఇళ్లల్లో నీరు చేరిందన్నారు. వారందరినీ పునరావాస కేంద్రాలకు తరలించి భోజనం, తాగునీరు. మందులు అందజేశామని తెలిపారు. ఇరిగేషన్ ఎస్ఈ మదన్‌గోపాల్, ఈఈ రాధాకృష్ణ, ఆర్డీవో భానుప్రకాస్‌రెడ్డి, తహసీల్దారు లక్ష్మీనారాయణ, ఎంపీడీవో రఫీ తదితరులు పాల్గొన్నారు.

సీమపందుల పెంపకం లాభదాయకం


ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి వీసీ రమణ

తిరుపతిరూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): శాస్త్రీయ పద్ధతుల ద్వారా సీమపందుల పెంపకం లాభదాయకంగా ఉంటుందని ఎస్వీ వెటర్నరీ వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ డాక్టర్ జేవీ రమణ తెలిపారు. వర్సిటీలోని నిరంతర పశువైద్య విద్య, సమాచార కేంద్రం(సీసీవీఈసీ) ఆధ్వర్యంలో సీమపందుల పెంపకంపై ఔత్సాహిక రైతులు, యువతకు మూడ్రోజుల శిక్షణను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. తక్కువ ఖర్చుతో దాణా తయారు చేసుకుని శాస్త్రీయ పద్ధతుల్లో పెంచడం ద్వారా ఎక్కువ లాభాలు పొందవచ్చని వివరించారు. డీఈ ప్రొఫెసర్ డాక్టర్ బి.శోభామణి, డీన్ ప్రొఫెసర్ డాక్టర్ కె.వీరబ్రహ్మయ్య, డీఆర్ ప్రొఫెసర్ సీహెచ్ శ్రీలత మాట్లాడుతూ స్వయం ఉపాధి కల్పించే ఇటువంటి శిక్షణను యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ డాక్టర్ కె.సుజాత, శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం.కల్యాణచక్రవర్తి, డాక్టర్ జి.గంగరాజు, డాక్టర్ డి.సురేష్‌బాబు, డాక్టర్ పి.మంజరి పందుల పెంపకంలో మెలకువలపై అవగాహన కల్పించారు.

అధ్యాపకులు నూతన నైపుణ్యాలు పెంచుకోవాలి


మాట్లాడుతున్న వీసీ కృష్ణమూర్తి

తిరుపతిరూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): అధ్యాపకులు నూతన బోధనా నైపుణ్యాలు పెంచుకోవాలని సంస్కృత వర్సిటీ వీసీ ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి కోరారు. వర్సిటీలోని మదన మోహన మాలవీయ టీచర్ ట్రైనింగ్ సెంటర్ ఆధ్వర్యంలో అప్లికేషన్స్ ఆఫ్ ఐకేఎస్ ఇన్ సాంస్క్రీట్ టెక్ట్స్ అండ్ ఇట్స్ కాంటెంపరరీ రిలవెన్స్‌పై ఏడు రోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను గురువారం ఆయన ప్రారంభించి, మాట్లాడారు. విభిన్న అంశాలపై ఈ శిక్షణ నిర్వహిస్తున్నామని తెలిపారు. అతిథిగా హాజరైన బెంగళూరుకు చెందిన పూర్ణప్రజ్ఞా సంస్కృత విద్యాపీఠం ప్రొఫెసర్ డాక్టర్ తిరుమల కులకర్ణి మాట్లాడుతూ భారతీయ జ్ఞాన పరంపర మహత్యం, దీన్ని అధ్యాపకులు ఆధునిక ధోరణిలో విద్యార్థులకు ఎలా బోధించాలన్న విషయాన్ని వివరించారు. కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్.మురళీధరరావు, ఎడ్యుకేషన్ విభాగం అధ్యాపకులు డాక్టర్ చారుకేష్, వివిధ వర్సిటీలకు చెందిన 45మంది అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎలక్ట్రోస్టీల్ కాస్టింగ్ పరిశ్రమపై సమీక్ష


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి ఎలక్ట్రోస్టీల్ కాస్టింగ్ లిమిటెడ్ పరిశ్రమ(ఈసీఎల్)కు సంబంధించి కలెక్టరేట్‌లో గురువారం పరిశ్రమ ప్రతినిధులు, అధికారులతో కలెక్టర్ వెంకటేశ్వర్ సమీక్షించారు. ఈసీఎల్ ప్లాంట్ తూర్పు గేట్ రహదారి వెడల్పును పరిశీలించాలన్నారు. వెంకటగిరి హైవేకు కనెక్ట్ చేసే రోడ్డు నిర్మాణం ఎస్టిమేట్ తయారు చేయాలని ఆదేశించారు. తెలుగుగంగ నీరు కేటాయింపు అంశంపైనా చర్చించారు. కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, పరిశ్రమ ప్రతినిధులు సురేష్ ఖండేవాల్, తిరుపతి కమిషనర్ మౌర్య, తెలుగుగంగ ఎస్ఈ మదన గోపాల్ పాల్గొన్నారు.

ఆరవ తరగతి నుంచి ఉద్యోగ నైపుణ్య శిక్షణ మంచిదికాదు

తిరుపతి విద్య, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ శిక్షణా నైపుణ్య కోర్సులను ఆరవ తరగతి నుంచి ప్రవేశపెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం భావించడం మంచిది కాదని ఆలిండియా డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ (ఏఐడీఎస్ఓ) నగర అధ్యక్షుడు నవీన్‌కుమార్ గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. విద్య అనేది విద్యార్థిని ఉన్నతమైన వ్యక్తిత్వంకలిగిన వ్యక్తిగా మార్చే ప్రక్రియ అని పేర్కొన్నారు. 10వ తరగతి వరకు ప్రకృతి, సమాజం గురించి మౌలికమైన విషయాలను, అవసరమైన భాషలు, సాహిత్యాన్ని బోధించి, విలువలను పెంపొందించాలని వెల్లడించారు. ఆ తర్వాత మాత్రమే ఉద్యోగ నైపుణ్య శిక్షణ ఇవ్వాలని సూచించారు.

విద్యార్థులకు కథల పోటీలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని యూనివర్సిటీ తెలుగు విభాగాల్లో చదువుకుంటున్న విద్యార్థులకు పద్మావతి యూనివర్సిటీ తెలుగు విభాగం కథల పోటీ నిర్వహించనుంది. ప్రముఖ రచయిత్రి ఓల్గా తన తండ్రి పేర ఏర్పాటు చేసిన పోపూరి వెంకట సుబ్బారావు ధర్మనిధి ఉపన్యాస కార్యక్రమంలో భాగంగా ఈ పోటీ చేపట్టనున్నారు. స్త్రీ - సామాజిక భద్రత అంశాన్ని నిర్దేశించారు. నవంబరు 10వ తేదీలోపు ఐదు పేజీలకు మించకుండా తెలుగులో టైప్‌చేసి డాక్టర్ యువశ్రీ, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు విభాగం, పద్మావతి మహిళా యూనివర్సిటీ, తిరుపతి పేరుతో పంపాల్సి ఉంటుంది. ఎంపికైన కథకు రూ.10 వేల బహుమతి అందజేస్తారు. ఈ మేరకు నిర్వాహకులు డాక్టర్ యువశ్రీ తెలిపారు. సమగ్ర సమాచారం కోసం 98859 40011లో సంప్రదించాలని కోరారు.

కలెక్టర్‌ను కలిసిన సిల్వి కల్చరిస్టు నరేంద్ర


కలెక్టర్‌కు మొక్క అందజేస్తున్న నరేంద్ర

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా స్టేట్ సిల్వి కల్చరిస్టు(బయోమెట్రిక్)గా జీజీ నరేంద్ర గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు.

అంతర్జాతీయ కర్లింగ్ పోటీలకు ఎంపిక


మొగధారమ్మను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ భువనేశ్వరీదేవి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ కర్లింగ్ పోటీలకు పద్మావతి జూనియర్ కాలేజీ విద్యార్థిని ధాత్రి మొగధారమ్మ ఎంపికయ్యారు. పాండిచ్చేరిలో ఇటీవల నిర్వహించిన జాతీయ కర్లింగ్ పోటీల్లో విజేతగా నిలిచారు. దీంతో అంతర్జాతీయ కర్లింగ్ పోటీలకు ఎంపికయ్యారు. ప్రిన్సిపాల్ భువనేశ్వరీదేవి అభినందించారు. అంతర్జాతీయ స్థాయిలో గెలుపొందాలని ఆమె ఆకాంక్షించారు.

శ్రీవారిసేవలో నటి రాశి



తిరుమల శ్రీవారిని గురువారం సినీ నటి రాశి దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా వచ్చిన ఆమె ఉదయం వీఐపీ బ్రేక్‌లో స్వామి సేవలో పాల్గొన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్స్



తిరుపతి (లీలామహల్), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): లీలామహల్ - కపిలతీర్థం మార్గంలోని అలిపిరి పోలీస్‌స్టేషన్ ఎదుట రోడ్డుపై మ్యాన్‌హోల్స్ మూతలు ప్రమాదకరంగా మారాయి. రెండు మూతలు రోడ్డు కంటే కిందికి వెళ్లడంతో గోతిలా ఏర్పడ్డాయి. దీన్ని గమనించలేక ద్విచక్ర వాహనదారులు, ఆటోవాలాలు ప్రమాదాల బారినపడుతున్నారు. అధికారులు స్పందించి బాగు చేయాలని కోరుతున్నారు.

సారూ.. పరిశీలించాలి మీరు

రుయాలో సమస్యలు పరిష్కారంకాక రోగుల అవస్థలు ● నేడు ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం

తిరుపతి(వైద్యం),అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): వేల మంది నిరుపేదలకు వైద్య సేవలు అందించే రుయాస్పత్రిలో గడిచిన ఐదేళ్లలో అనేక సమస్యలు తిష్ట వేశాయి. దీంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. సాధారణంగా ప్రతి మూడు నెలలకు ఒకసారి ఆస్పత్రి అభివృద్ధి కమిటీ (హెచ్‌డీఎస్) సమావేశాన్ని నిర్వహించి అభివృద్ధి, సమస్యల పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలి. కానీ, గత ఐదేళ్ల కాలంలో ఈ సమావేశం ఎనిమిది సార్లు మాత్రమే నిర్వహించడం విశేషం. అదీ అప్పటి అధికార పార్టీ నేతల అవసరాల మేరకే నిర్వహించారు తప్ప రోగులకు కలిగిన ప్రయోజనం లేదు. కూటమి అధికారంలోకి వచ్చాక గత నెల 17న హెచ్‌డీఎస్ సమావేశాన్ని నిర్వహించినా అధికారులు, కమిటీ సభ్యులు పూర్తి స్థాయిలో హాజరు కాకపోవడంతో వాయిదా వేశారు. ఈ క్రమంలో శుక్రవారం హెచ్‌డీఎస్ సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఇప్పుడైనా సమస్యల పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని పలువురు ఆకాంక్షిస్తున్నారు.

కొన్ని ప్రధాన సమస్యలను పరిశీలిస్తే..

● అత్యవసర విభాగాన్ని ఇరుకు గదిలోకి మార్చారు. పరిపడా పడకలను ఏర్పాటు చేయకపోవడంతో ఒకే పడకపై ఇద్దరు, ముగ్గురు రోగులకు వైద్యం అందించాల్సిన పరిస్థితి నెలకొంది.

● రోగులను వైద్య పరీక్షలకు వీల్‌చైర్లు, స్ట్రెచర్లపై తీసుకెళ్లడానికి, తగిన సాయంగా ఉండేందుకు 160 మంది ఎంఎన్‌వోలు, ఎఫ్ఎన్‌వోలకుగాను 60 మంది మాత్రమే ఉన్నారు. దీంతో రోగులను వారి సహాయకులే తీసుకెళుతున్నారు. ఇక, ఎంఎన్‌వోలు, ఎఫ్ఎన్‌వోల సంఖ్య తక్కువగా ఉండటంతో అత్యవసర విభాగానికి 108 వాహనాల్లో రోగులు వచ్చినప్పుడు దించుకునే వారు లేక గంటల తరబడి అంబులెన్సుల్లోనే ఉండాల్సిన పరిస్థితి.

● అత్యవసర వైద్యం కోసం వచ్చే వారు ఓపీ కోసం ఎండ, వాన తాకిడికి బయటనే క్యూలే నిల్చోవాల్సి వస్తుంది. ప్రత్యేక ఓపీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి.

● చిన్నపిల్లల విభాగంలో అల్ట్రాసౌండ్ స్కానింగ్ అందుబాటులో లేకపోవడంతో ఏడీ భవనంలో సాధారణ రోగులకు ఉపయోగించే కేంద్రానికి తీసుకొస్తున్నారు. దీంతో నవజాత శిశువులతో గంటల తరబడి తల్లులు నిరీక్షించాల్సి ఉంది.

● వైసీపీ హయాంలో అధికార పార్టీ నేతల అనుచరులే దుకాణాలను దక్కించుకున్నారు. వీరు ఐదేళ్లుగా పలు ప్రధాన దుకాణాలకు ఒక్క నెల కూడా అద్దె చెల్లించలేదు. దీంతో దుకాణాల నుంచి రూ.20 లక్షలకు పైగా అద్దె బకాయిలు ఉన్నాయి. అద్దె చెల్లించలేదని అధికారులు దుకాణాలు సీజ్ చేసి ఖాళీ చేయించారే కానీ.. వారి నుంచి అద్దె మాత్రం వసూలు చేయలేదు. అందులో కొన్ని దుకాణాలను మాత్రం గుట్టు చప్పుడు కాకుండా మరొకరికి కేటాయించారు. దీనివలన ఆస్పత్రికి రావాల్సిన రూ.లక్షల ఆదాయానికి గండి పడింది.

● ఆస్పత్రిలోని పరిపాలనా విభాగంలో కొందరు అధికారులు, సిబ్బంది గత వైసీపీ నేతల అండతో నిబంధనలకు విరుద్ధంగా ఒకే విభాగాల్లో తిష్టవేశారు. ఫోర్జరీ సంతకాలు, ఆరోగ్యశ్రీలో రూ.కోట్ల అవినీతి, మ్యూటివేషన్ పేరుతో రూ.లక్షల వసూళ్లు, మరణ ధ్రువీకరణ పత్రాలకు నగదు వసూళ్ల వంటి వీరి వ్యవహారాలు ఇటీవల వెలుగులోకి వచ్చాయి. వీటికి సంబంధించి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం, అవినీతి అక్రమాలకు పాల్పడిన వారిని కనీసం విభాగాలు కూడా మార్చకపోవడం ఇప్పటికీ ప్రశ్నార్థంగానే ఉంది.



17హరి3- రోగులను దింపుకొనేవారు లేక అత్యవసర విభాగం ముందు నిలిచిన 108 వాహనాలు

● రోగుల సౌకర్యార్థం రోటరీ క్లబ్ వారి సహకారంతో నిర్మించిన రోగుల సహాయకుల భవనం కొంత కాలంగా అసంపూర్తిగానే ఉంది. దీనిని అందుబాటులోకి తీసుకువచ్చే దిశగా చర్యలు చేపట్టాలి.

● ఆస్పత్రి ఆవరణలో ఆర్థో, ఊపిరితిత్తులు, సైకీయాట్రీ వంటి విభాగాలు ఆస్పత్రికి మారుమూలన ఉన్నాయి. ఈ వార్డులకు రోగులను స్ట్రెచర్లపై తీసుకువెళ్లాలంటే గుంతల రోడ్లతో ఇబ్బంది పడుతున్నారు.

● ఈ-ఆస్పత్రి పేరుతో రూ. లక్షలు ఖర్చు చేసి సుమారు వంద కంప్యూటర్లు కొనుగోలు చేశారు. కానీ వీటిని వాడకపోవడం వలన ఇప్పటికీ ఎక్స్‌రే, స్కానింగ్ రిపోర్టులు సెల్‌ఫోన్‌లో తీసుకురావాల్సిన పరిస్థితి ఉంది. రక్త పరీక్షల రిపోర్టులు కూడా చిత్తు కాగితాల్లో రాసివ్వాల్సి వస్తుంది.

● రోగుల సౌకర్యార్థం దాతలు అందించిన బ్యాటరీ వాహనాలు, అంబులెన్సులు మరమ్మతులకు గురయ్యాయి. వీటికి మరమ్మతులు చేపట్టక నిరుపయోగంగా వదిలేశారు.





అల్ట్రాసౌండ్ స్కానింగ్ కేంద్రం ముందు నవజాత శిశువులతో తల్లుల నిరీక్షణ - అసంపూర్తిగా నిలిచిన రోగుల సహాయకుల భవనం - రోగులను స్ట్రెచర్‌పై తీసుకెళుతున్న సహాయకులు - అత్యవసర విభాగంలో ఒకే పడకపై చికిత్స పొందుతున్న ఇద్దరు రోగులు

వాల్మీకి చరిత్రను పాఠ్యాంశంగా తీసుకురావాలి




వాల్మీకి విగ్రహానికి నివాళి అర్పిస్తున్న మధుసూదన్ - ఏడీ డాక్టర్ రమణ, అధ్యాపకులు - వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి విద్య, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి మహర్షి జీవిత చరిత్రను పాఠ్యాంశంగా తీసుకురావాలని బీజేపీ సీనియర్ నేత జల్లి మధుసూదన్ డిమాండ్ చేశారు. వాల్మీకి జయంతిని పురస్కరించుకుని గురువారం స్విమ్స్ కూడలిలోని ఆయన విగ్రహానికి పూలమాలలువేసి, నివాళులర్పించారు. మధుసూదన్ మాట్లాడుతూ ప్రపంచం ఆచరించదగిన రామాయణాన్ని రాసిన వాల్మీకి చరిత్ర భావితరాలకు స్ఫూర్తిదాయకమైందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గుండాల గోపీనాథ్‌రెడ్డి, వాల్మీకి అసోసియేషన్ నాయకులు గోపాల్, నాగరాజు, నాగేశ్వరరావు, వెంకటకిషోర్, నాగేంద్ర పాల్గొన్నారు.

ఎస్వీ అగ్రికల్చర్ వర్సిటీలో..

తిరుపతి రూరల్ : ఎస్వీ వ్యవసాయ కళాశాలలో అసోసియేట్ డీన్ డాక్టర్ ఎంవీరమణతో పాటు పలువురు అధ్యాపకులు వాల్మీకి చిత్రపటానికి పుష్పాంజలితో ఘన నివాళి అర్పించారు. వాల్మీకి రచించిన రామాయణ మహాకావ్యం నేటి మానవాళికి ఆదర్శమని తెలిపారు. సీనియర్ అధ్యాపకులు ఎంవీనాయుడు, రెడ్డిశేఖర్, వేమన, చంద్రిక, రాజశ్రీ, మోహన్‌నాయుడు, ఎంఎస్‌వీ చలం పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో..

తిరుపతి(నేరవిభాగం) : జిల్లా పోలీసు కార్యాలయంలో వాల్మీకి జయంతి నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి ఎస్పీ సుబ్బరాయుడు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఎస్పీ మాట్లాడుతూ ఆదర్శ గురువుగా ఆయన చూపిన మార్గంలో నడవడమే నిజమైన నివాళి అన్నారు. అదనపు ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

వాల్మీకి జీవితం స్ఫూర్తిదాయకం


వాల్మీకి మహర్షికి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మహాకవి వాల్మీకి మహర్షి జీవితం స్ఫూర్తిదాయకమని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వాల్మీకి జయంతిని నిర్వహించారు. కలెక్టర్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కృషి ఉంటే మనుషులు మహనీయులవుతారని, అలాంటి వారిలో వాల్మీకి మహర్షి ఒకరని అన్నారు. అందుకనే వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగగా జరుపుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, డీఆర్వో పెంచల కిషోర్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికార అధికారి చంద్రశేఖర్, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి బాల కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిలో 30మి.మీ వర్షపాతం

ముందస్తు జాగ్రత్తతో తప్పిన ఇబ్బందులు - కమిషనర్ మౌర్య


సహాయక చర్యలను పరిశీలిస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : రెండు రోజులుగా తుపాను ప్రభావంతో 30మి.మీ వర్షపాతం నమోదైందని, ముందస్తు జాగ్రత్తలతో ఇబ్బందులు తప్పాయని నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య చెప్పారు. లోతట్టు ప్రాంతాల్లో ప్రజలకు అందుతున్న సహాయక చర్యలను, పునరావాస కేంద్రాలను గురువారం అధికారులతో కలసి ఆమె పరిశీలించారు. కరకంబాడి మార్గంలో రోడ్లపైకి నీరు లేకుండా వినాయకసాగర్‌కు మళ్లించామని, కొరమేను గుంటలోకి రాకుండా డ్రైన్ ఏర్పాటు చేశామని అన్నారు. లక్ష్మీపురం సర్కిల్, రైల్వే అండర్ బ్రిడ్జిల కింద నీరు చేరిన వెంటనే ఎప్పటికప్పుడు తొలగిస్తూ వచ్చామన్నారు. ప్రతిరోజు క్లోరిన్, నీటి సాంద్రత పరీక్షలు చేస్తున్నామన్నారు. ముఖ్యంగా డ్రైనేజీ, కాలువలపై నిర్మాణాలు చేయడం వలనే ఇబ్బందులు వస్తున్నాయన్నారు. కాలువల్లో పాత పరుపులు, చెత్త వంటివి వేయకుండా చూడాలని ప్రజలను విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏడీసీ చరణ్ తేజ్ రెడ్డి, ఎస్ఈ శ్యాంసుందర్, ఎంఈ తులసీ కుమార్, గోమతి, ఎంహెచ్‌వో యువ అన్వేష్, ఆర్వోలు సేతు మాధవ్, రవి పాల్గొన్నారు.

అష్టోత్తర శతకలశాభిషేకం

తిరుపతి(కల్చరల్), అక్టోబర్ 17 (ఆంధ్రజ్యోతి): కోదండరామస్వామి ఆలయంలో గురువారం పౌర్ణమిని పురస్కరించుకుని స్వామివారికి అష్టోత్తర శతకలశాభిషేకం నిర్వహించారు. ఆలయంలోని కల్యాణ మండపంలో ఉదయం 9 నుంచి 10.30 గంటల వరకు సీతారాముల ఉత్సవమూర్తులకు 108 కలశాలతో అభిషేకం చేశారు. సాయంత్రం 5.30 గంటలకు సీతాలక్ష్మణ సమేత కోదండ రాములకు ఆలయంలో ఆస్థానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో నాగరత్న, ఇన్‌స్పెక్టర్ సురేష్ పాల్గొన్నారు.

స్విమ్స్‌లో రాష్ట్ర స్థాయి నాప్కాన్ క్విజ్ పోటీలు

తిరుపతి(వైద్యం), అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): స్విమ్స్‌లో మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ అల్లాడి మోహన్ ఆధ్వర్యంలో గురువారం రాష్ట్ర స్థాయి నాప్కాన్ క్విజ్ పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీకుమార్ మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యం, పట్టుదల పెరగడానికి ఈ పోటీలు దోహదపడతాయన్నారు. విద్యాభ్యాసానికి కూడా ఉపయోగపడతాయని తెలిపారు. అనంతరం విజేతలు డాక్టర్ ఎస్ భార్గవ్‌కుమార్‌కు రూ.5 వేలు, డాక్టర్ కాయత్రికి రూ.2,500 నగదు బహుమతులు,మిగిలిన వారికి ప్రశంసాపత్రాలు అం దజేశారు. ఎంఎస్ డాక్టర్ రామ్ పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం


వరలక్ష్మి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పద్మావతి వర్సిటీ విద్యా విభాగ పరిశోధకురాలు కె.వరలక్ష్మి డాక్టరేట్ పొందారు. ఇంపాక్ట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇంటర్వెన్షన్ ఆన్ లైఫ్ స్కిల్స్, న్యూట్రిషనల్ స్టేటస్, లైఫ్ స్టైల్ అండ్ న్యూట్రిషనల్ బిహేవియర్ ఆఫ్ క్యాన్సర్ సర్వైవర్స్ అంశంపై రిటైర్డు ప్రొఫెసర్ శారద పర్యవేక్షణలో ఆమె పరిశోధన పూర్తి చేశారు.

ఘనంగా మహాభారత ఉత్సవాలు




తిరుపతి (జీవకోన), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని జీవలింగేశ్వరస్వామి ఆలయంలో శ్రీకృష్ణ ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో మహాభారత ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా గురువారం సాయంత్రం ద్రౌపదీ కల్యాణం నిర్వహించి, రాత్రి శ్రీకృష్ణలీలలు నాటకాన్ని ప్రదర్శించారు. నాటకం ఆహూతులను ఎంతగానో అలరించింది. చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు పెద్దయెత్తున నాటకాన్ని వీక్షించారు. ఉత్సవాల్లో భాగంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈనెల 27వ తేదీ వరకు నాటక ప్రదర్శనలు జరుగుతాయని నిర్వాహకులు అన్నా రామకృష్ణ, అన్నా మల్లీశ్వరి తెలిపారు.





బైకు హోటల్

టమోటా రైస్, వెజ్ పలావ్, చపాతీ, పులిహోర రైస్, లెమన్ రైస్.. ఇలా స్కూటర్‌కు ప్లకార్డులు కట్టారు. ఫుట్‌పాత్‌పై స్టాండు పెట్టి ఇంటి నుంచి తీసుకొచ్చిన హాట్‌బాక్సు, గిన్నెలు సర్ది పెట్టారు. ఎండ, వానకు రక్షణకు పెద్ద గొడుగు ఉంచారు. అంతే.. రోడ్‌సైడ్ హోటల్ రెడీ. ఇంటి నుంచి తీసుకొచ్చిన ఆహార పదార్థాలు అయిపోగానే.. తిరిగి ఇంటికి వెళ్లిపోతారు రేణిగుంటకు చెందిన భరత్‌కుమార్. ఇలా గురువారం తిరుపతి నగరం కపిలతీర్థం రోడ్డులో స్కూటర్ హోటల్ కనిపించింది.

- తిరుపతి (కపిలతీర్థం), ఆంధ్రజ్యోతి

మందు కోసం..

జగన్ ఐదేళ్ల పాలనలో నాణ్యమైన మద్యానికి దూరమయ్యారు మందుబాబులు. ధర ఎక్కువైనా, నాసిరకం 'జే' బ్రాండ్లే దిక్కయ్యాయి. బుధవారం సాయంత్రం ప్రైవేటు మద్యం దుకాణాలు ప్రారంభం కాగానే.. తమకు కావాల్సిన బ్రాండ్ల కోసం బారులు తీరారు. గురువారం కూడా పలు మద్యం షాపుల వద్ద మందుబాబుల సందడి కనిపించింది.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి





తిరుమల ఆలయంలోకి మహాద్వారం గుండా ప్రవేశించగానే కుడివైపున ఉండే శ్రీకృష్ణదేవరాయలు, తిరుమలదేవి, చిన్నాదేవి విగ్రహాలు

నేడు శ్రీకృష్ణదేవరాయలు 459వ వర్ధంతి

వెంకన్న వీరభక్తుడు దేవరాయలు



తిరుమల ఆలయం ఉత్తరపు గోడమీద శ్రీకృష్ణదేవరాయలు క్రీ.శ.1513లో తెలుగులో వేయించిన శాసనం. తిరుమలదేవి, చిన్నాదేవిలు స్వామికి బంగారపు నైవేద్యపు పాత్రలు సమర్పించినట్లు ఇందులో పేర్కొన్నారు.

తిరుమల ఆలయానికి గొప్ప వైభవం రావడంలో విజయనగర రాజుల పాత్ర కీలకమైనది. వీరిలో శ్రీకృష్ణదేవరాయలు తిరుమల శ్రీవేంకటేశ్వరుడికి వీరభక్తుడు. తన 21 ఏళ్ల పాలనా కాలంలో ఆయన ఏడుసార్లు తిరుమలను సందర్శించారు. అనేక దానాలు చేశారు. స్వామికి విలువైన ఆభరణాలు చేయించి ఇచ్చారు. అందుకే తిరుమల ఆలయంలో ముకుళిత హస్తాలతో ఉన్న శ్రీకృష్ణదేవరాయలు విగ్రహం ఉంటుంది. ఆయనకు అటూ ఇటూ ఇద్దరు భార్యల విగ్రహాలుంటాయి. ఆయన వెంకన్నకి ఎంత భక్తుడంటే.. భార్యల్లో ఒకరి పేరు తిరుమల దేవి. కూతురికి తిరుమలాంబ అని, కుమారుడికి తిరుమల దేవరాయలు అని ఆయన పేర్లు పెట్టుకున్నారు. చిన్నల్లుడి పేరు కూడా తిరుమల రాయలు కావడం విశేషం. కృష్ణదేవరాయలు వేయించిన శాసనాల ద్వారా తిరుమల వైభవ విశేషాలు అనేక తెలుస్తాయి.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

ఏడుసార్లు తిరుమలకు వచ్చిన కృష్ణదేవరాయలు

- 1513 ఫిబ్రవరి 10వ తేదిన మొదటిసారిగా దేవరాయులు తిరుమలకు వచ్చారు. నవరత్న ఖచిత కిరీటాన్ని స్వామికి సమర్పించారు.
- 1513 మే 2న తిరుమలకు వచ్చిన ఆయన శ్రీవారికి పాలు నైవేద్యంగా సమర్పించటానికి 374 తులాల బంగారు గిన్నె ఇచ్చారు. ఉత్సవమూర్తులకు మూడు బంగారు కిరీటాలు ఇచ్చారు.
- 1513 జూన్ 13న శ్రీవారిని దర్శించుకున్న ఆయన నిత్యసేవల కోసం మాన్యాలు రాసిచ్చారు. నవరత్న ఖచిత ఆభరణాలు సమర్పించారు.
- 1513జూలై 6న స్వామిని దర్శించుకున్న శ్రీకృష్ణ దేవరాయలు 30 వేల బంగారు నాణేలతో అభిషేకం చేశారు. పలు బంగారు కానుకలను ఇచ్చారు.
- 1515 అక్టోబరు 25న తిరుమలకు వచ్చిన ఆయన మకరతోరణం సమర్పించారు.
- 1517 జనవరి 2న ఆనందనిలయానికి బంగారు పూత పూర్తి అయిన సందర్భంగా కూడా శ్రీకృష్ణ దేవరాయలు తిరుమలకు వచ్చారు.
- 1521 ఫిబ్రవరి 17న తిరుమలకు వచ్చిన ఆయన పీతాంబరంతో పాటు అత్యంత విలువైన వజ్రాలు, ఇతర బంగారు ఆభరణాలు సమర్పించుకున్నారు.

విశేషం

శ్రీకృష్ణదేవరాయలు సమర్పించిన బంగారు పాత్రలూ, ఆభరణాల జాబితా అయితే శాసనాల ఆధారంగా లభించింది కానీ, ఆభరణాలు ఒక్కటి కూడా ప్రస్తుతం లేవు. 1952లో టీటీడీ ఆధ్వర్యంలోకి వచ్చిన ఆభరణాలలో వీటి జాడ లేదు. అప్పటికే మాయమయ్యాయి. కరిగించి కొత్త ఆభరణాలు చేయించి ఉండవచ్చని ఒక ఊహ.

'జల'జలమంటూ..



సదాశివకోన



అమ్మవారికోన

సదాశివకోనలో జలపాత సోయగం

వడమాలపేట మండలంలోని దట్టమైన అటవీ ప్రాంతంలో ఉన్న సదాశివకోన, అమ్మవారి కోనల జలపాతాల సోయగం పర్యాటకులను అలరిస్తోంది. ఇటీవల కురిసన వర్షాలకు గతంలో ఎన్నడూ లేనివిధంగా ఉధృతంగా నీళ్ల జాలువారుతున్నాయి.

- వడమాలపేట, ఆంధ్రజ్యోతి

కనువిందు చేస్తున్న ఉబ్బలమడుగు

వరదయ్యపాళెం మండలంలోని ఉబ్బలమడుగు జలపాతం కనువిందు చేస్తోంది. రెండు రోజులుగా కురిసిన వర్షాలకు అడవిలో నుంచి ముందుకు సాగుతున్న ప్రవాహం.. చూపరులను ఆకట్టుకుంటోంది.

- వరదయ్యపాళెం, ఆంధ్రజ్యోతి





ఉధృతంగా కైలాసనాథ కోన

నారాయణవనం మండల పరిధిలో దట్టమైన అటవీ ప్రాంతంలో కామాక్షి దేవి సమేత కైలాసనాథ స్వామి కొలువై ఉన్నారు. అక్కడి కైలాసనాథ కోనలో ప్రస్తుతం వర్షాల కారణంగా జలపాతం ఉధృతంగా పడుతోంది. దీంతో భక్తుల రాకపోకలను నిషేధించారు. ప్రకృతి సోయగాల నడుమ, పెద్ద వృక్షాల మధ్య జలపాతం అత్యంత శోభాయామానంగా ఉంది. కొందరు భక్తులు ఇక్కడకు వచ్చి స్నానాలను ఆచరించి అయ్యప్పమాల ధరిస్తున్నారు.

- నారాయణవనం, ఆంధ్రజ్యోతి

సందడి.. సందడిగా

మూడు రోజులుగా తిరుమల కొండల్లో కురిసిన వర్షానికి జలధారలు పరుగులు తీస్తున్నాయి. తిరుపతిలోని కపిలతీర్థంలోకి జలపాతం ఉరుకుతోంది. ఈ నీటి సోయగాలను చూసేందుకు స్థానికులు, భక్తులు గురువారం తరలివచ్చారు. ఫొటోలు, సెల్ఫీలతో సందడి చేశారు.

- తిరుపతి(కపిలతీర్థం), ఆంధ్రజ్యోతి



ఉరుకుతున్న తలకోన



శేషాచలంలోని తలకోన జలపాతాలు ఆహ్లాదం పంచుతున్నాయి. కొండల నుంచి ఉవ్వెత్తున కిందికి ఉరుకుతున్నాయి. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఈ దట్టమైన అటవీప్రాంతంలో భారీగా నీరు చేరింది. తలకోన సముద్ర మట్టానికి సుమారు 700 అడుగు ఎత్తున ఉంది. దీంతో ఇక్కడి పర్వత శ్రేణుల శిఖరాల నుంచి వర్షపు నీరు ఉధృతంగా కిందకు చేరుతున్న తీరు మానసికోల్లాసం కలిగిస్తోంది. భద్రత దృష్ట్యా ప్రస్తుతం ఇక్కడకు భక్తులను అనుమతించడంలేదు.

- ఎర్రావారిపాలెం, ఆంధ్రజ్యోతి





శ్రీవారికి పౌర్ణమి గరుడసేవ

తిరుమలలో గురువారం పౌర్ణమి గరుడసేవ వైభవంగా జరిగింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 8వ తేదీన గరుడవాహనమెక్కి దర్శనమిచ్చిన శ్రీవారు పౌర్ణమి సందర్భంగా మరోసారి విశేష అలంకరణలో తన ఇష్టవాహనమైన గరుత్మంతుడిపై కొలువుదీరారు. ఆలయ నాలుగు మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో మంగళవాయిద్యాలు, వేదమంత్రాలు, భక్తుల కర్పూర నీరాజనాలు, గోవిందనామ స్మరణల మధ్య గరుడోత్సవం కన్నుల పండువగా జరిగింది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



అతిథిగృహం ముందు అక్టోపస్ సిబ్బంది

'పద్మావతి'లో అక్టోపస్ మాక్‌డ్రిల్

తిరుమల, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని పద్మావతి అతిథిగృహంలో గురువారం రాత్రి అక్టోపస్ కమాండోలు మాక్‌డ్రిల్ నిర్వహించారు. వీరు ప్రతినెలా ఒక్కో ప్రదేశంలో మాక్‌డ్రిల్ నిర్వహిస్తుంటారు. ఈక్రమంలో శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చే వీవీఐపీలు బస చేసే పద్మావతి అతిథిగృహంలో గురువారం రాత్రి మాక్‌డ్రిల్ చేపట్టారు. వీవీఐపీని ఎవరైనా బంధిస్తే ఎలా రక్షించాలనే అంశంపై ఈ ఆపరేషన్ సాగింది.

ప్రైవేట్ పాఠశాలకు షోకాజ్ నోటీసులు

కోట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కోటలోని ఓ ప్రైవేట్ పాఠశాలకు జిల్లా విద్యాశాఖాధికారి శేఖర్ నోటీసులు జారీచేసినట్లు ఎంఈవో మస్తానయ్య గురువారం తెలిపారు. తుపాన్ కారణంగా కలెక్టర్ వెంకటేశ్వర్ మూడు రోజులపాటు సెలవుదినం ప్రకటించినప్పటికి ఈ నెల 15వ తేదీన తరగతులు నిర్వహించడం.. తహసీల్దారు జయజయరావు, ఎంఈవో మస్తానయ్య, ఎంపీడీవో వేణు పాఠశాలను తనిఖీచేసి డీఈవోకు నివేదికలు పంపారు. దీంతో ఆ పాఠశాల యాజమాన్యంకు షోకాజ్‌నోటీసులు జారీ అయినట్లు ఎంఈవో తెలిపారు.

ఆర్టీసీ బస్సుల పునరుద్ధరణ

తిరుపతి(ఆర్టీసీ), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా కొన్ని గ్రామాలకు ఆర్టీసీ యాజమాన్యం తాత్కాలికంగా సర్వీసులను నిలిపేసింది. బుధవారం సాయంత్రానికే వర్షం తగ్గిపోవడం, గురువారం ఎండ రావడంతో మధ్యాహ్నం నుంచి అన్ని మార్గాల్లో బస్సుల రాకపోకలను పునరుద్ధరించారు. తిరుపతి- గుడిమల్లం, సూళ్లూరుపేట- కొరిడి, పెర్నాడు, వేనాడు, శ్రీకాళహస్తి- పెరిమిడి, పాలచూరు, సత్యవేడు- శ్రీకాళహస్తి, పాపవినాశనం- తిరుమల, వెంకటగిరి- ఉడమలపాడుకు 25 బస్సులు యథావిధిగా నడుస్తున్నాయి. శ్రీవారిమెట్టు మార్గంలో శుక్రవారం ఉదయం నుంచి నడవనున్నాయి. వర్షాల కారణంగా ఆర్టీసీ రోజు రాబడి సరాసరి రూ.1.7కోట్లు నుంచి బుధవారం రూ.1.3కోట్లకు పడిపోయింది.

మద్యం దుకాణాలు ఇక్కడొద్దు



తిరుపతిలో తరలించాలంటూ ఆందోళన

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): తమ ప్రాంతంలో మద్యం దుకాణాలు వద్దని, తరలించాలంటూ జిల్లాలోని మూడు చోట్ల స్థానికులు గురువారం ధర్నాకు దిగారు. తిరుపతి నగరం డీబీఆర్ ఆస్పత్రి పక్కన ఏర్పాటు చేసిన మద్యం దుకాణం తొలగించాలని సీపీఎం నగర కార్యదర్శి సుబ్రహ్మణ్యం, ఐద్వా జిల్లా కార్యదర్శి సాయిలక్ష్మి ఆధ్వర్యంలో స్థానికులు దుకాణం ఎదుట బైఠాయించారు. గుడి, బడి, ఆస్పత్రి, నివాస ప్రాంతాల్లో మద్యం దుకాణాలు ఏర్పాటు చేయకూడదని నిబంధనలు ఉన్నా పట్టించుకోకపోవడం సరికాదన్నారు. ప్రజలకు ఇబ్బందిలేని చోటకు మార్చకుంటే ఆందోళన తీవ్రం చేస్తామని హెచ్చరించారు. సీపీఎం నేతలు వేణుగోపాల్, రమణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరిమేనిపాడు దళితవాడలో ప్రతిఘటన

ఓజిలి, ఆంధ్రజ్యోతి: ఓజిలి మండలం ఆరిమేనిపాడు దళిత కాలనీ వద్ద మద్యం షాపు ఏర్పాటు చేయవద్దంటూ గురువారం దళితులు ప్రతిఘించారు. ఓజిలిలో ఒక షాపు, ఆరిమేనిపాడు దళితకాలనీలో మరో షాపును ఏర్పాటు చేసేందుకు వేలం పాటదారులు సన్నాహాలు చేసుకున్నారు. దీంతో అక్కడి దళిత కాలనీవాసులు షాపు ఏర్పాటును ప్రతిఘటించారు. కాలనీవాసులకు ఇదే దారి కావడంతో మద్యం మత్తులో ఉన్న వారి ఆగడాలు మహిళలకు ఇబ్బందులు కలిగిస్తాయంటూ వాగ్వివాదానికి దిగారు. ఎక్సైజ్ సీఐ అరుణకుమారి గ్రామానికి వెళ్లి అక్కడి దళితులతో మాట్లాడి వారి నుంచి ఫిర్యాదు తీసుకున్నారు. జిల్లా ఉన్నతాధికారుల ఉత్తర్వులు లేనిదే తాముకూడా ఏమీ చేయలేమంటూ తేల్చి చెప్పారు. జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసుకుంటే సమస్యకు పరిష్కారం ఉంటుందని దళితులకు సూచించారు. ప్రత్యక్ష చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.





ఎక్సైజ్ అధికారులతో మాట్లాడుతున్న స్థానికులు

చిన్నపాండూరులోనూ మార్చాలంటూ..

వరదయ్యపాలెం, ఆంధ్రజ్యోతి: వరదయ్యపాలెం మండలం చిన్నపాండూరు ప్రధాన రహదారి పక్కన ఉన్న మద్యం దుకాణాన్ని తరలించాలని పరిసర గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ మేరకు గురువారం వారు సత్యవేడు ఎక్సైజ్ సీఐని కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రధాన రహదారి పక్కనే మద్యం దుకాణం ఉండటంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందని.. పొలాలకు వెళ్లే రైతులు, శ్రీసిటీకి వెళ్లే ఉద్యోగులు ఈ మార్గం గుండానే వెళ్లాల్సి ఉన్నందున ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. బస్సులు, టిప్పర్లు, ఆటోలు వెళుతున్న నేపథ్యంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ఈ మద్యం దుకాణాన్ని మరోచోటకు మార్చాలని వారు కోరారు.

వేనాటి ఫ్లెక్సీ రేపిన రాజకీయ చర్చ



మంత్రి ఆనంతో ఉన్న వేనాటి ఫ్లెక్సీ

సూళ్లూరుపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నాలుగు దశాబ్దాలకు పైగా పార్టీ ఆవిర్భవం నుంచి టీడీపీలో ఉన్న టీటీడీ బోర్డు మాజీ సభ్యులు, సీనియర్ నేత వేనాటి రామచంద్రా రెడ్డి ఎన్నికల ముందు వైసీపీలో చేరిన విషయం తెలిసిందే. ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, వైసీపీ ఓటమి పాలవ్వడంతో వేనాటి అప్పటి నుంచి పార్టీకి దూరంగా ఉంటు న్నారు. ఈ నేపథ్యంలో సూళ్లూరుపేటలో వేనాటి అభిమానులు టీడీపీకి చెందిన మంత్రి ఆనం రామనారాయణ రెడ్డితో కలిసి ఉన్న ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. ఈ ఫ్లెక్సీ ఇప్పుడు పట్టణంలో చర్చనీయాంశమైంది. వేనాటి ఫ్లెక్సీ పార్టీ కార్యాలయం ఎదుటే వెలవడం హాట్ టాపిక్‌గా మారింది.

చెంగాళమ్మ సేవలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి



సూళ్లూరుపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): తెలుగు, తమిళ భక్తుల ఆరాధ్య దైవమైన చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారిని గురువారం తెలంగాణా రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.సుధ దర్శించుకొన్నారు. న్యాయమూర్తిని సహాయ కమిషనర్ ప్రసన్న లక్ష్మి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అమ్మవారి దర్శనంతరం వేదపండితులు ఆశీర్వవచనంచేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట కోర్టు అదనపు న్యాయమూర్తి ఎస్.అనూష, ఆర్డీవో ఈ.కిరణ్మయి, తహసీల్దార్ ఎస్‌వి.నరసింహరావు, సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ బ్రహ్మనాయుడు ఉన్నారు.

స్వర్ణముఖి పరవళ్లు



పెన్నక్కచెరువులోకి పరుగులు తీస్తున్న నీరు

కోట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కోట మండలం గూడలి వద్ద ఉన్న స్వర్ణముఖి నది వరద నీటితో పరవళ్లు తొక్కుతోంది. ఎగువ ప్రాంతాలైన నాయుడుపేట, శ్రీకాళహస్తిల నుంచి నీరు వస్తుండడంతో గూడలి వద్ద ఉన్న స్వర్ణముఖి, మామిడి కాలువ త్రివేణి సంగమం పరివాహక గ్రామాల రైతులు ఆనందంలో మునిగితేలారు. అలాగే 7వేల ఎకరాల ఆయకట్టు భూములున్న పెన్నక్కచెరువులోకి స్వర్ణముఖి నీరు చేరడంతో చిల్లకూరు, కోట మండలాల ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పెన్నక్కచెరువు కింద నారుమడులు పోసుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

కారు ఢీకొని ఒకరి మృతి



మృతి చెందిన డిల్లీ బాబు

తడ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనాన్ని కారు ఢీ కొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. తడలో నివాసం ఉంటున్న డిల్లీ బాబు (55) తన స్నేహితుడు బవర్‌లాల్ పనిమీద అతడి బైక్‌పై వెనుక కూర్చోని స్థానిక తహసీల్దారు కార్యాలయానికి బయలుదేరారు. మార్గమధ్యంలో బోడిలింగాలపాడు మలుపువద్ద నెల్లూరుకు వెళ్లే కారు అదుపుతప్పి వెనుక నుంచి ఢీకొంది. ద్విచక్ర వాహనం వెనుక కూర్చోని ఉన్న డిల్లీబాబు డివైడర్‌పై పడి తీవ్ర గాయాలపాలై అక్కడిక్కడే మృతి చెందాడు. వాహనం నడుపుతున్న బవర్‌లాల్ రోడ్డుపైన పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. వెంటనే పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని గాయపడ్డ బవర్ లాల్‌ను శ్రీసిటీ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం చెన్నైకి తరలించారు డిల్లీబాబు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీసీ రోడ్ల నిర్మాణాలకు భూమిపూజ



బాలాయపల్లి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి) మండలంలోని పలు పల్లెల్లో గురువారం 'పల్లె పండుగ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కయ్యూరులో రూ.12 లక్షలు, కాలగంధలో రూ.13 లక్షలు, సిద్ధాగుంటలో రూ.4 లక్షలు చొప్పున 29 లక్షల వ్యయంతో సిమెంటు రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విసీల్ కుమార్, ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ మోహన్‌రాజు, ఏపీఓ మృత్యుంజయరావు, ఎంపీటీసీ చంద్రమౌళి, నాయకులు జనార్ధన్‌రెడ్డి, రామచంద్రయ్య, పెంచలయ్య పాల్గొన్నారు.

120 గ్రాముల గంజాయి స్వాధీనం



వెంకటగిరిటౌన్, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): గంజాయి కలిగి ఉన్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. గురువారం స్థానిక అంబేడ్కర్ కాలనీలో పోలీసులు దాడిచేశారు. షేక్ రహంతుల్లా వద్ద వెయ్యి రూపాయల విలువైన 120 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సీఐ రమణ మాట్లాడుతూ గంజాయిపై ఉక్కుపాదం మోపుతు న్నామని అన్నారు. ఈ దాడుల్లో ఎస్ఐ రాంబాబు, సిబ్బంది మునిప్రసాద్, నారాయణ పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులపై అవగాహన



మాట్లాడుతున్న ఏడీఏ నాగార్జునసాగర్

వెంకటగిరిటౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రైతులు యాజమాన్య పద్ధతులపై అవగాహన పెంచుకోవాలని ఏడీఏ నాగార్జునసాగర్ అన్నారు. గురువారం స్థానిక కుర్జాగుంట, బుసపాళెంలో 'పొలంపిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఆర్ఎన్ఆర్-15048 రకం సాగు పద్ధతులపై, డ్రంసీడర్‌పై అవగాహన కల్పించారు. ఏవో సుజాత, పలువురు రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

గోతులు..ఆదమరిస్తే అంతేసంగతులు..!



చెన్నూరు సమీపంలో ప్రధాన రహదారిపై భారీ గోతులు



గోతుల కారణంగా కష్టాలు పడుతున్న వాహనదారులు

గూడూరు అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గూడూరు- వెంకటగిరి ప్రధాన రహదారి ముందే గోతులమయంగా ఉండేవి. మూడు రోజులుగా కురిసిన వర్షాలకు మరింత అధ్వానంగా తయారై మోకాళ్ల లోతు గోతులు పడ్డాయి. గూడూరు నుంచి వెంకటగిరి, రాపూరుకు వెళ్లే మార్గంలో చెన్నూరు గ్రామసమీపంలో సుమారు కిలోమీటరు మేర రోడ్డు గుంతలమయంగా తయారైంది. దీంతో వర్షపు నీరు నిల్వచేరడంతో గోతులు కనిపించక వాహనాలు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

తప్పిన తుఫాన్ ముప్పు

గూడూరు అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ ప్రమాదం తప్పడంతో ఇటు ప్రజలు అటు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. తుఫాన్ కారణంగా రెండు రోజులుగా ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. తుఫాన్ తడ సమీపంలో తీరం దాటుతుందని దీంతో భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారిచేశారు. ప్రధానంగా వాకాడు మండలం తూపిలిపాళెం వద్ద సముద్రం 20 అడుగుల మేర ముందుకు రావడంతో తీరప్రాంత గ్రామాలైన వాకాడు, కోట, చిల్లకూరు మండలాల్లో అధికారులు అప్రమత్తమై పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే బుధవారం అర్ధరాత్రి తడ సమీపంలో తుఫాన్ బలహీనపడి తీరం దాటడంతో ముప్పు తప్పడంతో జనం ఊపిరి పీల్చుకున్నారు.

లాక్‌లు ఏర్పాటు చేయాలి

వాకాడు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): తిరుమూరు చెరువు తూములకు లాక్‌లు ఏర్పాటు చేయాలని ఆయకట్టు మాజీ అధ్యక్షుడు కేసీవీ రమణయ్య అధికారులను కోరారు. వర్షాలకు చెరువు నిండినా నీరు నిలవడం లేదని పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

స్వర్ణముఖినదికి వరద రైతుల్లో ఆనందం



వాకాడు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ ప్రభావంతో పలుచోట్ల కురిసిన భారీ వర్షాలతో గురువారం సాయంత్రం 4.50 నిమిషాలకు వరదనీరు స్వర్ణముఖి నది బ్యారేజీకి చేరుకుంది. బ్యారేజీలోకి నీరు చేరడంతో తహసీల్దారు రామయ్య, ఇరిగేషన్ ఏఈ శ్రీనివాసులు స్వర్ణ ముఖిచెక్ డ్యామ్ నుంచి 14 చెరువులకు వరదనీటిని మళ్లించారు. స్వర్ణముఖి నీరు చెరువులకు చేరడంతో 15 వేల ఎకరాల ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు



వెండిచీర అలంకరణలో అమ్మవారు

చిల్లకూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పుకనుపూరు గ్రామంలో కొలువైన ముత్యాలమ్మ అమ్మవారికి గురువారం పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు, చండీహోమపూజలు నిర్వహించారు. అమ్మవారిని భక్తుల దర్శనార్థం వెండిచీర అలంకారంలో ఉంచారు. రాత్రికి అమ్మవారికి పల్లకీసేవ జరిపారు.

ఇసుక అక్రమ రవాణాకు బ్రేక్



కాళంగిలో ప్రవహిస్తున్న నీరు

సూళ్లూరుపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో ఇన్నాళ్లు జోరుగా సాగిన ఇసుక అక్రమ రవాణాకు వర్షంతో బ్రేకు పడింది. కాళంగి నది నుంచి కొందరు ఇసుకను ఇలుపూరు, సుద్దమడుగు తాగేలి, మోదుగులపాలెం ప్రాంతాల వద్ద తవ్వి ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా తరలించే వారు. మూడు రోజుల కురిసిన భారీ వర్షానికి కాళంగికి భారీగా నీరు చేరడంతో ఇసుక అక్రమ రవాణాకు బ్రేకు పడింది.

నేడు ఓజిలి మండల సమావేశం

ఓజిలి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఓజిలి మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు.

యుద్ధప్రాతిపదికన పనులు పూర్తిచేయాలి



తూము డామేజీని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

వెంకటగిరిటౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కవలపూడి- ఎల్లకారు మార్గం మధ్యలో ఆర్‌అండ్‌బీరోడ్డు పనులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. గురువారం మండలంలోని కలవపూడి-ఎల్లకారు మార్గంలో దెబ్బతిన్న రోడ్డును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పనులకు నిధులను వెంటనే మంజూరు చేసేలా చర్యలు చేపడుతామన్నారు. అడవి పోరంబోకు స్థలంలో ఇళ్లు కట్టుకున్న తమకు రెవెన్యూ సిబ్బంది పొజిషన్ సర్టిఫికెట్ ఇవ్వడం లేదని వారు కలెక్టర్ దృష్టికి తీసుకు వచ్చారు. ఏళ్ల తరబడి సీజేఎఫ్ ఎస్ భూములలో సాగు చేసుకుంటున్న వారికి పట్టాలను మంజూరు చేయాలని విన్నవించారు. రికార్డులను పరిశీలించి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులు, ఇళ్లను గుర్తించి నివేదికలను అందించాలన్నారు. ఎంపీడీవో కోటేశ్వరరావు, ఆర్ఐ రాజేష్ పాల్గొన్నారు.

హైకోర్టు ఉత్తర్వులు బేఖాతర్

- వీవోఏలను విధుల్లోకి తీసుకోని 'వెలుగు'



హైకోర్టు ఉత్తర్వులను చూపుతూ ఆవేదన వ్యక్తం చేస్తున్న వీవోఏలు

బాలాయపల్లి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): దేవుడు వరమిచ్చినా పూజారి వరమివ్వని చందంగా హైకోర్టు ఆదేశించినా వీవోఏ(విలేజ్ ఆర్గనైజేషన్ ఏజెంట్లు)ను విధుల్లోకి తీసుకోని పరిస్థితి మండలంలోని వెలుగు కార్యాలయంలో జరుగుతోంది. బాధిత వీవోఏల కథనం మేరకు.. మండలంలోని అలిమిలి, మన్నూరు, కయ్యూరు గ్రామాలకు చెందిన వీవోఏలు మాధవి, వాణి, హజరత్తమ్మలను విధులకు రావద్దని ఓ సీసీ ఆదేశించారు. గ్రామ సంఘం తీర్మానించినా విధులకు రావద్దనడంతో వారు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో వారిని విధుల్లోకి తీసుకోవాలని కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఆ మేరకు వారు కొన్ని రోజులుగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఇదే క్రమంలో గురువారం కూడా వచ్చారు. సీసీని కలవగా 'మీరు కోర్టుకు వెళ్లారుగా..ఉద్యోగం కోర్టు వాళ్లే ఇస్తారు పోండి' అని పంపించేశారు. దీంతో వారు న్యాయం కోసం విలేకరులను ఆశ్రయించారు. ఉన్నతాదికారులు స్పందించి న్యాయం చేయాలని కోరుతున్నారు.

వీడిన వాయుగండం..ఊపిరిపీల్చుకున్న అధికారులు, ప్రజలు





తిమ్మాజికండ్రిగ చెరువుకు చేరిన వర్షపునీరు, గుంతలమయంగా మారిన చిగురుపాడు రోడ్డు

నాయుడుపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా మూడు రోజులుగా ఓ మోస్తారు వర్షాలు కురిశాయి. బుధవారం అర్ధరాత్రి వాయుగుండం తీరం దాటడంతో గురువారం ఎండ కాసింది. వాయుగుండం తీరందాటే సమయంలో భారీ వర్షాలు, ఈదురుగాలులు వీస్తాయన్న అధికారుల హెచ్చరికలతో ప్రజలు ఆందోళన చెందారు. ముందస్తు చర్యలుగా పట్టణంలో 13, మండలంలో 16 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే వాయుగుండం తప్పడంతో అందులోకి ఎవరూ వెళ్లలేదు. అటు అధికారులు, ఇటు ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు.

వరండాలోనే విధులు..!



మందులు తడవకుండా కప్పి ఉన్న ఫ్లెక్సీ



వరండాలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్

బాలాయపల్లి, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): వర్షం రాకతో బాలాయపల్లి పశు వైద్యాధికారి వరండాలోనే విధులు నిర్వహించాల్సి వచ్చింది. బాలాయపల్లిలోని పశువైద్యశాల భవనం దుస్థితికి చేరుకుని పెచ్చులూడుతోంది. చిన్నపాటి వర్షానికే ఉరుస్తుంది. మూడు రోజులుగా కురిసిన వర్షానికి పశువైద్యాధికారి గదితో పాటు మందులు నిల్వ ఉండే గది చిత్తడిగా మారింది. దీంతో పశువైద్యాధికారి గురువారం వరండాలో కూర్చుని విధులు నిర్వహించారు. ఉన్నతాధికారులు స్పందించి పశువైద్య శాలను బాగుచేయాలని పశువైద్యాధికారితోపాటు పాడి రైతులు కోరుతున్నారు.

గుంతలమయంగా జీఎన్‌టీ రోడ్డు



ఆర్‌అండ్‌బీ కార్యాలయ సమీపంలో ఇలా



అధ్వానంగా ఉన్న జీఎన్‌టీ రోడ్డు

సూళ్లూరుపేట, అక్టోబరు 17 (ఆంధ్ర జ్యోతి): సూళ్లూరుపేటలోని జీఎన్‌టీ రోడ్డు రాళ్లుతేలి గుంతలు పడడంతో వాహన చోదకులకు అవస్థలు పడుతున్నారు. వైసీపీ పాలనలో ఈ రోడ్డుకు తట్టెడు మట్టి కూడా వేయకపోవడంతో ఇలాంటి పరిస్థితి ఏర్పడింది. దీనికి తోడు తుఫాన్ ప్రభావంతో మూడు రోజుల పాటు కురిసిన వర్షాలకు రోడ్డు అధ్వానంగా మారింది. పట్టణానికి రావాలంటే ముఖద్వారం హోలిక్రాస్ సర్కిల్ నుంచి రైల్వేస్టేషన్ రోడ్డు వరకు దాదాపు అర కిలోమీటరు మేర రాళ్లులేచి రోడ్డు మధ్యలో పెద్దపెద్ద గుంతలు ఏర్పడి వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి. ద్విచక్ర వాహనాదారులైతే గుంతల్లో పడిపోయిన ఘటనలు చోటు చేసుకొంటున్నాయి. ఆర్‌అండ్‌బి బంగ్లా, కార్యాలయం ముందే గుంతలున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఎమ్మెల్యే, అధికారులు స్పందించి కనీసం తాత్కాలిక మరమ్మతులైనా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

గుండెపోటుతో లారీ డ్రైవర్ మృతి

తడ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : గుండెపోటుతో ఓ లారీ డ్రైవర్ మృతి చెందాడు. తమిళనాడు తిరుచురాపల్లి జిల్లా రౌతంమేడు గ్రామానికి చెందిన కర్ణన్‌అన్నాదొరై (37) లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం చెన్నై నుంచి లోడ్ తీసుకొని శ్రీసిటీకి వచ్చాడు. అక్కడ సరుకును అన్‌లోడ్‌చేశారు. మళ్లీ లోడింగ్ కోసం స్థానిక నిప్పో పరిశ్రమ ఎదురుగా ఖాళీస్థలంలో లారీని నిలిపి నిద్రపోయాడు. బుధవారం లారీ యజమాని శ్రీసిటీలో సరుకులోడింగ్ కోసం వెళ్లాలని చెప్పేందుకు ఫోన్ చేశాడు. ఆ ఫోన్ ఎత్తకపోవడంతో పరిశ్రమవారికి లారీ విషయం ఆరా తీయాలని కోరాడు. పరిశ్రమకు చెందిన వ్యక్తులు ఈ లారీని బుధవారం రాత్రి సమయంలో గుర్తించారు. డ్రైవర్ క్యాబిన్ లోపల నిర్జీవంగా ఉండటం గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల సమక్షంలో అతడిని బయటకుతీశారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గురువారం కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. వారి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

గూడూరు అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్ పరిధిలోని గూడూరు- కొండాగుంట రైల్వే మార్గంలో గల టిడ్కోగృహాల సమీపంలోని రైల్వేపట్టాల సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెంది ఉండటాన్ని రైల్వేసిబ్బంది గుర్తించారు. రైల్వేజీఆర్ పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి వయసు 35 సంవత్సరాలు ఉండవచ్చని భావిస్తున్నారు. బూడిద రంగు చొక్కా, నీలిరంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. రైలులో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు జారిపడి మృతిచెంది ఉంటాడని భావి స్తున్నారు. రైల్వే జీఆర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా చండీయాగం



సూళ్లూరుపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పౌర్ణమి పర్వదినం సందర్భంగా చెంగాళమ్మ ఆలయంలో గురువారం మహా చండీయాగం వైభవంగా నిర్వహించారు. ఉభయకర్తలుగా నెల్లూరుకు చెందిన డాక్టర్ రమణారెడ్డి దంపతులు వ్యవహరించారు. వారికి సహాయ కమిషనర్ అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఘనంగా వాల్మీకి జయంతి



ఓజిలి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఓజిలి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వాల్మీకి జయంతి ఘనంగా నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. ఎంపీడీవో విజయలక్ష్మి, ఏఓ విజయరాణి, సీనియర్ సహాయకులు ప్రసూన, పాల్గొన్నారు.

నారుమడులలో జాగ్రత్తలు తీసుకోవాలి

నాయుడుపేట టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : రైతులు సేద్యంలో నారు మడుల పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా మంచి దిగుబడులను సాధించవచ్చని ఏవో గణేష్ అన్నారు. మర్లపల్లి, అత్తలపాళెం గ్రామాల్లో గురువారం 'పొలం పిలుస్తోంది' కార్య క్రమంలో రైతులకు నారుమడి యాజ మాన్యం గురించి వివరించారు. వీఏఏలు చెంగల్‌రాజు, ఆదినారాయణరెడ్డి, పాల్గొన్నారు.

పెళ్లకూరు: ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించి సాగు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏవో ప్రవీణ పేర్కొన్నారు. చిల్లకూరు, జీలపాటూరు గ్రామాలలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. రసాయన ఎరువులు తగ్గించి సేంద్రియ సాగుచేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీఏఏ చందు, మణెయ్య, ఏహెచ్‌ఏ లతవ్యకుమార్ తదితరులు ఉన్నారు.

సీపీఐ నాయకుడి సతీమణికి ఎమ్మెల్యే నివాళి

సూళ్లూరుపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సీపీఐ నాయకుడు మోదుగుల రమణయ్య సతీమణి అన్నపూర్ణమ్మ అనారోగ్యంతో మృతిచెందిన విషయం తెలిసిందే. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ఆమె భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యేతో పాటు టీడీపీ నాయకులు ఆకుతోట రమేష్ ఉన్నారు.

రీసర్వే పూర్తయిన గ్రామాల్లో నేటి నుంచి గ్రామ సభలు

పెళ్లకూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వే పూర్తయిన గ్రామాల్లో శుక్రవారం నుంచి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ యువరాజ్ తెలిపారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ నెల 18న తాళ్వాయిపాడు, 19న జీలపాటూరు, 21న కానూరు, 22న పెన్నేపల్లి, 23న బంగారంపేట, 24న శెట్టిగుంట, 25న పెళ్లకూరు, 26న ఊడిపూడి, 27న అర్లపాడు గ్రామాలలో గ్రామ సభలు నిర్వహిస్తామన్నారు. భూ సమస్యలపై అర్జీలు స్వీకరిస్తామన్నారు.

పునరావాస కేంద్రంలో భోజనం పంపిణీ

కోట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కోటలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలోని పునరావాస కేంద్రంలో గురువారం పీపుల్స్ ప్రొటెక్షన్ ఫోర్స్ సంస్థ ఆహారాన్ని అందించింది. సంస్థ ప్రతినిధులు మీజూరు మల్లికార్జున్‌రావు, తిరుమలశెట్టి కోటేశ్వరరావు, బాలసుబ్రహ్మణ్యం భోజనాలను అందించారు. ఈ పునరావాస కేంద్రాన్ని తహసీల్దారు సందర్శించారు.

దుస్థితిలో గూడూరులోని సీసీరోడ్లు

గూడూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలువీధుల్లో సీసీరోడ్లు దుస్థితికి చేరుకున్నాయి. మున్సిపాలిటీ పరిధిలో గత టీడీపీ ప్రభుత్వంలో పలు వార్డులలోని వీధుల్లో జన్మభూమి పథకం ద్వారా సీసీ రోడ్లను ఏర్పాటు చేశారు. అయితే మంచినీటి కొళాయి కనెక్షన్‌లు తీసుకునే సమయంలో సీసీరోడ్లను పగలగొట్టి తిరిగి వాటిని అభివృద్ధి పరచకపోవడంతో అవి గుంతలమయంగా మారాయి. దీనికి తోడు గత వైసీపీ ప్రభుత్వంలో ప్రైవేటు గ్యాస్ ఏజెన్సీ అండర్ పైప్‌లైన్ల నిర్మాణం కోసం సీసీరోడ్లను పగలగొట్టారు. ఆ గుంతలను కొన్ని ప్రాంతాల్లో పూడ్చివేసినా మరికొన్ని ప్రాంతాల్లో అలాగే వదలివేశారు. ఫలితంగా ఆ గుంతలు అలాగే ఉండిపోయాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రధానంగా నాయుడుకాలువకట్ట, నలజాలమ్మ వీధి, కృష్ణమందిరం వీధి, కోనేటిమిట్ట, మాళవ్యానగర్, సత్రపువీధి తదితర ప్రాంతాల్లో సీసీరోడ్లు అక్కడక్కడా గోతులమయంగా మారాయి. దీంతో చిన్నపాటి వర్షానికే నీరు నిల్వచేరి గుంతలు కనిపించక పలువురు పాదాచారులు, ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. దెబ్బతిన్న సీసీరోడ్లను బాగుచేయాలని స్థానికులు కోరుతున్నారు.





దెబ్బతిన్న నాయుడుకాలువకట్ట వద్ద సీసీ రోడ్డు, గుంతలమయంగా ఉన్న కృష్ణమందిరం వీధి

తొండమనాడు చెరువు నిండటం సంతోషకరం


తొండమనాడు చెరువును పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

శ్రీకాళహస్తి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): తొండమనాడు చెరువు పూర్తిస్థాయిలో నిండటం సంతోషకరమని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. శ్రీకాళహస్తి మండలంలోని తొండమనాడు చెరువును అధికారుల బృందంతో కలిసి గురువారం కలెక్టర్ పరిశీలించారు. చెరువు కలుజును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత వర్షాలకు ముందు తొండమనాడు చెరువులో 0.1 టీఎంసీ నీరు మాత్రమే నిల్వ ఉండేదన్నారు. అల్పపీడనంతో కురిసిన భారీ వర్షాలతో తొండమనాడు చెరువులో 0.5టీఎంసీల నీరు నిల్వ చేరి కలుజు పారే స్థాయికి రావడం సంతోషకరమన్నారు. దీంతో ఈ చెరువు ఆయకట్టు కింది 14 గ్రామాల రైతులకు మేలు జరుగుతుందన్నారు. అలాగే 4,386 ఎకరాల ఆయకట్టుకు సాఫీగా సాగునీరు అందుతుందన్నారు. డ్రైన్ వాటర్‌ను సాగునీరుకు ఉపయోగించుకోవడం ఎంతో ఉత్తమమని సీఎం చంద్రబాబు ఎప్పుడూ చెబుతుంటారని గుర్తు చేశారు. తొండమనాడు చెరువు ద్వారా ఆయన మాటలు నిజమవుతున్నాయని తెలిపారు. ఇక జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో 350కుపైగా ఇళ్లల్లో నీరు చేరిందన్నారు. వారందరినీ పునరావాస కేంద్రాలకు తరలించి భోజనం, తాగునీరు. మందులు అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్ఈ మదన్‌గోపాల్, ఈఈ రాధాకృష్ణ, ఆర్డీవో భానుప్రకాస్‌రెడ్డి, తహసీల్దారు లక్ష్మీనారాయణ, ఎంపీడీవో రఫీ తదితరులు పాల్గొన్నారు.

నీట మునిగిన పంటల పరిశీలన


నీట మునిగిన వరిపైరును పరిశీలిస్తున్న ఏవో భారతి

బుచ్చినాయుడు కండ్రిగ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో గత నాలుగు రోజుల నుంచి కురిసిన భారీ వర్షాలకు నీటి మునిగిన వరి పంటలను మండల వ్యవసాయ అధికారిణి భారతి గురువారం పరిశీలించారు. కుక్కంబాకం, కనమనంబేడు, నెరిణికండ్రిగ, తలారివెట్టు గ్రామాల్లో రైతులు వేసిన వరి పైర్లు నీట మునిగాయి. పంటలను పరిశీలించిన ఏవో జిల్లా అధికారులకు నివేదికలు పంపుతున్నట్లు తెలిపారు.

తగ్గిన నీటి ఉధృతి

- పూడి గ్రామాల ప్రజలకు ఊరట


పూడి గ్రామాల వంతెనపై ప్రజల రాకపోకలు

కేవీబీపురం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజులకండ్రిగ వద్ద ఉన్న పూడి గ్రామాలకు వెళ్లే మట్టి వంతెనపై వర్షాల కారణంగా నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న విషయం తెలిసిందే. బుధవారం సాయంత్రం వర్షం తగ్గడంతో నీటి ఉధృతి తగ్గింది. దీంతో మట్టి వంతెన కొద్దిగా మరమ్మతులకు గురైనా గురువారం నుంచి రాకపోకలకు ఇబ్బంది లేకపోవడంతో పూడి గ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ



శ్రీకాళహస్తి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): అమెరికాలో ప్రమాదవశాత్తు మృతి చెందిన శ్రీకాళహస్తి వాసుల కుటుంబాల ఇంటికి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి గురువారం వెళ్లి పరామర్శించి, ఓదార్చారు. తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా మృతదేహాలను ఇండియాకు రప్పించడానికి తానా సభ్యులతో ఎమ్మెల్యే మాట్లాడారు.

స్నానపు ఘట్టాలకు మరమ్మతులు చేపట్టండి


స్నానపు ఘట్టంలో ఉన్న దుస్తులు


పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

శ్రీకాళహస్తి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ సమీపంలోని స్వర్ణముఖి నది వద్ద ఏర్పాటు చేసిన స్నానపు ఘట్టాలకు మరమ్మతులు చేపట్టాలని బీజేపీ పట్టణాధ్యక్షుడు గరికపాటి రమేష్‌బాబు అన్నారు. గురువారం బీజేపీ నాయకులు స్నానపు ఘట్టాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తీశ్వరస్వామి అమ్మవార్ల దర్శనం, రాహుకేతు పూజల కోసం సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు స్వర్ణముఖి నదిలో స్నానమాచరించి అనంతరం దర్శనానికి వెళుతుంటారన్నారు. వీరి సౌకర్యం కోసం ఏర్పాటు చేసిన స్నానపు ఘట్టాలను ఆలయ అధికారులు పర్యవేక్షించకపోవడంతో సరైన సౌకర్యాలు లేక భక్తులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈవో వెంటనే స్నానపు ఘట్టాలను పరిశీలించి మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలన్నారు కార్తీకమాసం, ధనుర్మాసంలో భక్తులు ఎక్కువగా స్నానమాచరిస్తుంటారని తెలిపారు. వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు సహాయక చర్యలు


గిరిజన కాలనీవాసులకు అన్నం పెడుతున్న దృశ్యం

ఏర్పేడు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గత మూడు రోజులుగా కురిసిన వర్షానికి ఏర్పేడు మండలంలోని అంజిమేడు పంచాయతీ పోతుమానుగుంట గిరిజనకాలనీలో కొన్ని కుటుంబాల ఇళ్లల్లోకి నీరు చేరింది. దీంతో 27మంది గిరిజనులను అధికారులు అంగనవాడీ కేంద్రంలోకి తరలించి సహాయక చర్యలు చేపట్టారు. వారికి మూడు రోజులుగా మూడు పూటలా భోజన వసతి కల్పించారు. ఈ సౌకర్యాలను గురువారం ఏర్పేడు ఎంపీడీవో సౌభాగ్యం, తహసీల్దారు భార్గవి పరిశీలించారు.

పుత్తూరు వార్తలు

పల్లె పండుగ గ్రామాల అభివృద్ధికి సంకేతం


సీసీ రోడ్డుకు భూమి పూజ చేస్తున్న నాయకులు, అధికారులు

వడమాలపేట, అక్టోబర్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్‌బీఆర్ పురంలో రూ.8 లక్షలతో నిర్మించనున్న సిమెంట్ రోడ్డుకు గురువారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ధనంజయులు నాయుడు, ఉపాధి ఏపీవో సుజాత, పీఆర్‌డీఈ వెంకటరమణ, ఏఈలు నాగేంద్ర, రామ్మోహన్, టీడీపీ నాయకులు ఉమాపతి రావ్, పెద్దబ్బరాజు, సుకుమార్, రవి, శ్యామయ్య, హరిరాజు, నారాయణరాజు, మైనమ్మ, గీత, వాణి తదితరులు పాల్గొన్నారు.

వర్షాలకు దెబ్బతిన్న రెండు ఇళ్లు

పుత్తూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పుత్తూరు మండలం ఈశ్వరాపురంలో రెండు ఇళ్లు వర్షాలకు దెబ్బతిన్నాయని తహశీల్దార్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సంఘటన మినహా మండలంలో ఎలాంటి నష్టం జరుగలేదని ఆయన పేర్కొన్నారు. బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు 57.1 మి.మి వర్షపాతం నమోదైంది. గురువారం వర్షం లేకపోవడంతో ప్రజలు యథావిధిగా పనులు నిర్వహించుకున్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

గురు దక్షిణామూర్తికి శాస్త్రోక్తంగా పూజలు


ప్రత్యేక అలంకారంలో గురుదక్షిణామూర్తి

శ్రీకాళహస్తి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మేధో గురు దక్షిణామూర్తికి గురువారం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా కలశ ప్రతిష్ఠ ఏర్పాటు చేసిన అనంతరం వినాయక పూజల కలశ పూజ వైదిక కత్రువులు నిర్వహించారు. స్వామివారికి పాలు, పెరుగు, పంచామృతం, చందనం, నారికేళ జలాలతో వైభవంగా అభిషేకం నిర్వహించారు. సుగంధ పూలు, స్వర్ణాభరణాలతో విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. పర్వత హారతి, చక్ర హారతి, కుంభ హారతి, మహామంగళ హారతులు ఇచ్చారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. వేదపండితులు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దుర్గంధ వలయంలో రాచగున్నేరి

● అధ్వానంగా పారిశుధ్య నిర్వహణ ● పట్టించుకోని అధికారులు


రాచగున్నేరి పంచాయతీలో అధ్వానంగా ఉన్న పారిశుధ్యం దృశ్యాలు

శ్రీకాళహస్తి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి మండలంలోని రాచగున్నేరి పంచాయతీలో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా మారింది. పంచాయతీ పరిధిలో ఎక్కడ చూసినా మురుగు పేరుకుపోయి పరిసరాలు దుర్గంధ భరితంగా మారాయి. ఈ పంచాయతీ పరిధిలో పారిశ్రామికవాడ ఉండటంతో వలస కార్మికులు అధికసంఖ్యలో నివసిస్తుంటారు. పంచాయతీ పరిధిలో వందలాది నివాసగృహాల్లో ప్రజలు జీవిస్తున్నారు. మురుగునీటి వ్యవస్థ నిర్మాణం కాకపోవడంతో ఎక్కడికక్కడ వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. పంచాయతీ నుంచి అంతంతమాత్రంగా పారిశుధ్య చర్యలు జరుగుతున్నట్లు స్థానికులు వా పోతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయా ంలో ఈ పంచాయతీ పరిధిలో పారిశుధ్యం బాగా దెబ్బతినడంతో అంటువ్యాధులు విపరీతంగా వ్యాప్తి చెందాయి. మూడు నెలల ముందు కూడా ఇక్కడ డయేరియా విజృంభించడంతో ప్రజలు అల్లాడిపోయారు. రెండు నెలల నుంచి ఇక్కడ ముగ్గురు గ్రీన్ అంబాసిడర్లు పారిశుధ్య నిర్వహణ కోసం సేవలందిస్తున్నారు. సిబ్బంది కొరత ఉండటంతో ఈ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బొల్లినేని జగన్నాథం నాయుడు తన సొంత నిధులతో రెండేళ్ల నుంచి పారిశుధ్య చర్యలను కొనసాగించారు. ఇటీవల పదిరోజుల నుంచి స్వచ్ఛందంగా సేవలందించే జగన్నాథం నాయుడు కు పనిచేసే ప్రైవేటు కార్మికులు సహకారం అందించడం మానేశారు. ఓ ప్రైవేటు పరిశ్ర మ యాజమాన్యం పరోక్షంగా పారిశుధ్య చర్యలు సహకరించిన వారిని వేధింపులకు గురిచేస్తోందంటూ కార్మికులుచెప్పడంతో తా ను కూడా కాలువలు శుభ్రం చేయడం, చెత్తను తొలగించే పనులను నిలిపివేశానని జగన్నాథం నాయుడు తెలిపారు. దీనిపై అధికారులు స్పందించి పారిశ్రామికవాడలో మురికికూపంగా మారిన రాచగున్నేరి పంచాయతీలో యుద్ధ ప్రతిపాదికన ప్రక్షాళన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనాఉంది. వర్షాల సీజన్ కావడంతో దుర్గంధంతో పాటు దోమ లు విపరీతంగా వృద్ధి చెందుతున్నాయి. సం బంధిత అధికారులు అలసత్వం వీడకపోతే సీజనల్ వ్యాధులతో రాచగున్నేరి ప్రజలు విలవిలాడిపోయే పరిస్థితి కనిపిస్తోంది.

సీసీరోడ్లు, మురుగు కాలువల నిర్మాణాలకు ఎమ్మెల్యే భూమిపూజ


జ్యోతినగర్ భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి - నాగలాపురంలో ఎమ్మెల్యే ఆదిమూలం - బీఎన్‌కండ్రిగలో భూమి పూజ చేస్తున్న నాయకులు, అధికారులు


కొత్తమారికుప్పంలో భూమిపూజ చేస్తున్న శ్రీపతి బాబు

రేణిగుంట, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ఉపాధి పథకం కింద రేణిగుంట మండలానికి రూ.2.45కోట్లు నిధులు మంజూరు కాగా, గురువారం పట్టణంలోని జ్యోతినగర్‌లో రూ.9.70లక్షలు, తారకరామనగర్, కరకంబాడిలో రూ.22లక్షలు వెచ్చించి నూతన సీసీరోడ్లు, మురుగుకాలువల నిర్మాణానికి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. జ్యోతినగర్ ప్రజలు మురుగుకాల్వ, రోడ్డుకు అడ్డంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, త్వరలో మురుగుకాలువ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చాలని విద్యుత్ ఏఈకి ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాగేశం, టీడీపీ నాయకులు, డీఎల్‌పీవో ప్రభురెడ్డి, ఎంపీడీవో విష్ణుచిరంజీవి, ఈవోపీ ఆర్డీ ప్రభురావు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాగలాపురం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పల్లె పండుగ కార్యక్రమంతో గ్రామాలు సమగ్రాభివృద్ధి సాధిస్తాయని ఎమ్మెల్యే ఆదిమూలం పేర్కొన్నారు. గురువారం నాగలాపురం బీసీకాలనీలో ఎంపీటీసీ సెల్వకుమార్ ఆధ్వర్యంలో రూ.30 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు, డ్రైనేజీ కాలువల నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో నిర్వీర్యమైన పంచాయతీ వ్యవస్థ పటిష్టతకు పల్లెపండుగ వారోత్సవాల ద్వారా కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. ● టీపీకోట పంచాయతీలో సెక్రటరీ శైలేంద్ర కుమార్ ఆధ్వర్యంలో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ జగన్నాథం, మాజీ సర్పంచ్‌లు నజీర్ సాహెబ్, మనోహర్, మణి నాయకులు రషీద్, చాన్ బాష, మహ్మద్ అలీ, బాబు సాహెబ్, బషీర్ సాహెబ్, సుబ్రమణ్యం రెడ్డి, లియాఖత్, గౌస్‌బాష తదితరులు పాల్గొన్నారు

సత్యవేడు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని నియోజకవర్గ టీడీపీ కో ఆర్డినేటర్ శ్రీపతి బాబు పేర్కొన్నారు. మండల పరిధిలోని కొత్తమారి కుప్పం ఎస్టీ కాలనీలో ఎంపీడీవో చంద్రశేఖర్ ఆధ్వర్యంలో శ్రీపతి బాబు సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు చంద్రశేఖర్ నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, తహసీల్దార్ సుబ్రమణ్యం, నాయకులు పరమశివం, అమాసరెడ్డి, అమాసరెడ్డి, సురేంద్ర రెడ్డి, శశి మోహన్, షణ్ముగం, ఇంజనీర్ ఇబ్రహీంఖాన్, ఏపీవో కృష్ణయ్య, సెక్రటరీలు లోకేష్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తలారివెట్టు, కల్లివెట్టు, వేణుగోపాలపురం, నెలవాయి, వెస్టవరత్తూరు గ్రామాల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణం, గోకుల షెడ్లకు అధికారులు, టీడీపీ నాయకులు గురువారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో సత్యవేడు నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు చంద్రశేఖర్ నాయుడు, ఏపీడీ ప్రేమ్‌కుమార్, ఎంపీడీవో త్రివిక్రమ్‌రావు, తిరుపతి పార్లమెంట్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు శ్రీపతి బాబు, మండల పార్టీ అధ్యక్షుడు సుధాకర్ నాయుడు, జిల్లా గ్రంథాలయ మాజీ ఛైర్మన్ కన్నయ్య నాయుడు, జనసేన మండల అధ్యక్షుడు బాషా, బీజేపీ నాయకులు మునిచంద్రరెడ్డి, నాయకులు రవినాయుడు, మధునాయుడు, సుందరయ్య, భాస్కర్, మునిరాజా, ధనంజయ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కేవీబీపురం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజుకండ్రిగ, కళత్తూరు, ఎస్ఎల్‌పురం, ఆదవరం గ్రామాల్లో గురువారం టీడీపీ మండలాధ్యక్షుడు రామాంజులనాయుడు ఆధ్వర్యంలో సీసీ రోడ్లకు భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతు పార్లమెంటు అధ్యక్షుడు గోపీనాథ్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, జనసేన అధ్యక్షుడు థామస్, మాజీ సర్పంచ్ రజిత, మల్లికార్జున్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, పాలెగారి సంఘం అధ్యక్షులు వెంకటకృష్ణయ్య, జయకుమార్, ఆనంద్‌రావు, సాధు తదితరులు పాల్గొన్నారు.

ఏర్పేడు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంజిమేడులో రూ.10లక్షలతో, కోబాకలో రూ.7లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్డు రోడ్డుకు గురువారం టీడీపీ సీనియర్ నేత, ఏపీసీడ్స్ మాజీ డైరెక్టర్ కందాటి శివశంకర్‌రెడ్డి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్, సూరినాయుడు, భూపతియాదవ్, శివాజీరెడ్డి, గోపాల్‌రెడ్డి, గంగులనాయుడు, ఎంపీటీసీ గౌరి, విజయశేఖర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పిచ్చాటూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పిచ్చాటూరు మండలం రామాపురం పంచాయతీ పరిధిలోని ఎస్టీ కాలనీలో రవి, జీడీనగర్ గ్రామంలో రామచంద్రరాజు ఆధ్వర్యంలో గురువారం సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. సర్పంచ్ శేఖర్, కార్యదర్శి పూర్ణిమ, ఉపాధిహామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ఎస్ఎల్‌పురంలో, అంజిమేడులో సీసీరోడ్డుకు భూమిపూజ చేస్తున్న నాయకులు, అధికారులు

ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు


వాల్మీకి మహర్షికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాళహస్తి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురువారం వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. దేవదాయ ధర్మదాయశాఖ ఆదేశాల మేరకు ఆలయ ఆవరణంలో 16కాళ్ల మండపం వద్ద వాల్మీకి చిత్రపటం ఉంచి అర్చకులు విశేష పూజలు, ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉరివేసుకుని వ్యక్తి మృతి

రేణిగుంట, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): టిఫిన్ దుకాణంలో ఉరి వేసుకుని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం ఉదయం రేణిగుంటలో జరిగింది. రేణిగుంట అర్బన్ పోలీసుల కథనం మేరకు.. మండల పరిధిలోని తిమ్మయ్య గుంటకు చెందిన మునిరత్నం(50) అనారోగ్య కారణంగా పాత చెక్ పోస్టు షట్టర్‌కు బీగాలు వేయకుండా వదిలివేయడంతో టిఫిన్ దుకాణంలోకి వెళ్లి వైర్లతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు అందించిన సమాచారం మేరకు రేణిగుంట అర్బన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయా ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీఐకు సన్మానం

ఏర్పేడు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రమోషన్‌పై ఏర్పేడు సీఐగా వచ్చిన జయచంద్రను ఆంధ్రప్రదేశ్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నేతలు గురువారం ఏర్పేడు పోలీస్‌స్టేషన్‌లో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శ్రీనాథ్, జిల్లా అధ్యక్షుడు రేగంటి దేవానంద్, ప్రధాన కార్యదర్శి సుబ్బారెడ్డి, మహిళా అధ్యక్షురాలు మంజుల, రాష్ట్ర కౌన్సిలర్ విజయలక్ష్మి, శ్రీకాళహస్తి డివిజన్ అధ్యక్షులు ఇందిరాదేవి తదితరులు పాల్గొన్నారు.


సీఐ జయచంద్రను సన్మానిస్తున్న సీపీఎస్‌ఎంప్లాయిస్ సంఘం నేతలు

వర్షాలకు అధ్వానంగా మారిన గ్రామీణ రోడ్లు

● ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, ప్రజలు


ఆర్ అనంతపురం దగ్గర గుంతలమయమైన రోడ్డు

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో గత నాలుగు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు ఆలత్తూరు, పెద్దపాలేడు, ఆర్ అనంతపురం, జీఎన్‌కండ్రిగ, పూసలపల్లి, పీలీకండ్రిగ తదితర గ్రామీణ రోడ్లు అధ్వానంగా మారాయి. ఐదు సంవత్సరాల నుంచి రోడ్లకు మరమ్మతులు చేపట్టకపోవడంతో పాటు ఈ వర్షాలకు రోడ్లు రూపు రేఖలు కనబడకుండా పోయాయి. ఈ రోడ్లలో ప్రయాణించడానికి వాహనదారులు, ప్రజలు నానాఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్లకు కనీస మరమ్మతులైనా చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

గుడిమల్లం ఆలయానికి డబుల్‌రోడ్డు నిర్మించండి


ఎమ్మెల్యేకి వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు

ఏర్పేడు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): భారతదేశంలో మొదటి శివాలయంగా గుర్తింపు పొందిన గుడిమల్లం పరశురామేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం పాపానాయుడుపేట నుంచి గుడిమల్లం వరకు డబుల్ రోడ్డు నిర్మించేందుకు కృషి చేయాలని ఆలయ మాజీ ఛైర్మన్ గిరి నాయుడు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డిని కలిసి కోరారు. గురువారం ఎమ్మెల్యేకు ఆయన వినతిపత్రం అందజేశారు. గిరి నాయుడు మాట్లాడుతూ గుడిమల్లం ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం డబుల్‌రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన ఎమ్మెల్యే సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. టీడీపీ నాయకులు ధనంజయులు నాయుడు, మోహన్ నాయుడు, నాగరాజు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు చైన్ స్నాచర్ల అరెస్టు

శ్రీకాళహస్తి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఇద్దరు చైన్ స్నాచర్లను అరెస్టు చేసినట్లు శ్రీకాళహస్తి రెండవ పట్టణ సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. తమిళనాడు రాష్ట్రం సేలంకు చెందిన శశికుమార్(23), సురేష్(20) శ్రీకాళహస్తి పట్టణంలోని కుందేటివారి వీధిలో రెండు రోజుల క్రితం మహిళ మెడలో గొలుసును లాక్కుని ఉడాయించారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. శ్రీకాళహస్తి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలో గురువారం శశికుమార్, సురేష్‌ను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

ఘనంగా శ్రీకృష్ణదేవరాయల వర్ధంతి


శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న అంజూరు శ్రీనివాసులు తదితరులు

శ్రీకాళహస్తి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): విజయనగర సామ్రాజ్యాధిపతి శ్రీకృష్ణదేవరాయల వర్ధంతిని గురువారం శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రాజగోపురం వద్ద గల శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కాపుసంఘం నాయకులు ఉప్పు కృష్ణయ్య, ఉదయ్‌కుమార్, మున్నా రాయల్, గరికపాటి చంద్రశేఖర్, గణేష్, రవి, సురేష్, గోపి తదితరులు పాల్గొన్నారు.